# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 56 | విశాఖపట్నం | 26-11-2025 బుధవారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 56 | VISAKHAPATNAM | 26-11-2025 WEDNESDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9849349934


### ఏపీలో కొత్తగా 3 జిల్లాల ఏర్పాటుకు

## చంద్రబాబు ఆమోదం

### మార్కాపురం, మదనపల్లె, పోలవరం జిల్లాలు



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలనా సౌలభ్యాన్ని మరింత మెరుగుపరిచే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు ఆయన ఆమోదముద్ర వేశారు. మంత్రుల కమిటీ సమర్పించిన నివేదికపై రెండు రోజుల పాటు సమీక్ష నిర్వహించిన చంద్రబాబు, కొన్ని మార్పులతో ఈ ప్రతిపాదనలను అంగీకరించారు. దీంతో రాష్ట్రంలోని మొత్తం జిల్లాల సంఖ్య 26 నుంచి 29కి చేరనుంది. కొత్తగా మార్కాపురం, మదనపల్లె, పోలవరం జిల్లాలు ఏర్పడనున్నాయి. పోలవరం జిల్లాకు రంపచోడవరం కేంద్రంగా ఉండనుంది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతాయని, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లాలతో పాటు, రెవెన్యూ వ్యవస్థలోనూ కీలక మార్పులు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు కూడా సీఎం అంగీకరించారు. **కొత్త రెవెన్యూ డివిజన్లు ఇవే:** నక్కపల్లి (అనకాపల్లి జిల్లా), అద్దంకి (ప్రకాశం జిల్లా), పీలేరు (మదనపల్లె జిల్లా), బనగానపల్లె (నంద్యాల జిల్లా), మడకశిర (సత్యసాయి జిల్లా).

### ఉద్యానవన పంటల ద్వారా రైతుల

# ఆదాయం పెంచాలి: చంద్రబాబు

**అమరావతి, పతాకం న్యూస్:** ఉద్యాన రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాయలసీమలో హార్టికల్చర్ పంటల సాగుకు సబ్సిడీలు, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్‌తో చేయూతను ఇచ్చే అంశాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఉద్యానవన పంటల ద్వారా రాయలసీమ రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళిక అమలుపై మంత్రులు, అధికారులతో చర్చించారు. ఈ సమీక్షకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన పూర్వోదయ పథకంలో భాగంగా రాయలసీమలో ఉద్యాన పంటల అభివృద్ధిపై చర్చించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో 92 క్లస్టర్ల ద్వారా హార్టికల్చర్ సాగును ప్రోత్సహించేలా ప్రభుత్వం కార్యాచరణ ఉండాలని సీఎం స్పష్టం చేశారు. 5.98 లక్షల మంది ఉద్యాన రైతులకు మరింత లబ్ధి కలిగేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. డ్రిప్, సాగునీరు, రవాణా, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పంచాయతీ రాజ్ రోడ్లు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, గోడౌన్లు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించం ద్వారా హార్టికల్చర్ రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, డిమాండ్ ఉన్న పంటల



సాగు, టెక్నాలజీ వాడకం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని హార్టికల్చర్ పంటలకు ప్రోత్సాహం కల్పించే దిశగా ప్రణాళికలు ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఉద్యాన పంట ఉత్పత్తులకు విలువ జోడింపు ద్వారా అధిక ఆదాయం వచ్చేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్లస్టర్ అభివృద్ధి విధానం ప్రవేశపెట్టాయి. ఈ ఏడాది నుంచే అమలు చేయనున్నారు.

స్థానికంగా ఎక్కువగా పండించే ఉత్పత్తులను ఎంపిక చేసి పారిశ్రామిక వేత్తలు, రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య, కంపెనీలు, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రాజెక్టు నిర్వహిస్తారు. వచ్చే మూడు నెలల్లో ఔత్సాహికుల ఎంపిక పూర్తి చేసి వారితో నేషనల్ హార్టికల్చర్ బోర్డుకు దరఖాస్తు చేయించాలని రాష్ట్ర ఉద్యానశాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారు.

### హక్కులతో పాటు బాధ్యతలను కూడా

## గుర్తుంచుకోవాలి: లోకేశ్



**అమరావతి, పతాకం న్యూస్:** రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి అందరూ మాట్లాడతారని, కానీ బాధ్యతల గురించి ఆలోచించరని, హక్కులతో పాటు బాధ్యతలు కూడా అంతే ముఖ్యమని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరిలోని మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని కూర్మాల శ్రీ కనకపుట్లమ్మ, జరగనున్న 'స్టూడెంట్ మాక్ అసెంబ్లీ'కి ఎంపికైన సందర్భంగా ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు విద్యార్థినిని, ఆమె కుటుంబ సభ్యులను ఉండవల్లిలోని తన నివాసానికి పిలిపించి మాట్లాడారు. మంగళగిరి బీఆర్ నగర్‌లోని మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న శ్రీ కనకపుట్లమ్మ, పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి ఈ గౌరవాన్ని దక్కించుకుంది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "నేటి విద్యార్థులే రేపటి మా భవిష్యత్. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా యువశక్తి ప్రాధాన్యత గురించి తరచూ చెబుతుంటారు. రాజ్యాంగ దినోత్సవం రోజున విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించాలనే ఆలోచనను సీఎం గారితో చర్చించి నిర్ణయించాం" అని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని లోకేశ్ వివరించారు. "అమ్మకు చెప్పలేని పనులు చేయకూడదని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారు నిన్నటి విలువల విద్యాసదస్సులో చక్కగా చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తాం. విద్యార్థులు బాగా చదువుకుని, ఉన్నత స్థానాలకు ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు. ప్రతి ఏటా స్టూడెంట్ మాక్ అసెంబ్లీ నిర్వహిస్తామని, కనకపుట్లమ్మను చూసి మరో పది మంది విద్యార్థులు స్ఫూర్తి పొందుతారని అన్నారు. ఈ సందర్భంగా, "మాక్ అసెంబ్లీలో మాకేమైనా సలహాలు, సూచనలు ఇస్తారా?" అని మంత్రి సరదాగా వ్యాఖ్యానించారు. కార్యక్రమానికి సీఎం, స్పీకర్ హాజరవుతున్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

### ముంచుకొస్తున్న మరో తుపాను.. రైతులు

## అప్రమత్తంగా ఉండాలి: అచ్చెన్నాయుడు




**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రానికి తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన తీవ్ర అల్ప పీడనం, వాయుగుండంగా మారి రానున్న 48 గంటల్లో తుపానుగా బలపడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. పంట నష్టం జరగకుండా రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. ముఖ్యంగా వరి కోతలు పూర్తిచేసిన రైతులు, తమ ధాన్యాన్ని తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని విజ్ఞప్తి చేశారు. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు ప్రభుత్వం తరఫున రైతులకు ఉచితంగా టార్పలిన్ పట్టాలు పంపిణీ చేస్తున్నామని అచ్చెన్నాయుడు వెల్లడించారు. రైతులు జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించి వాటిని పొందవచ్చని తెలిపారు.



### శతాబ్దాల గాయాలు మానిపోయాయి : మోడీ

2లో



### అవయవదానంతో మరణించినా జీవించవచ్చు!

6లో

### 2029 నాటికి అర్హులైన పేదలందరికీ

## ఇళ్లు: పార్థసారథి

**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో అర్హత ఉన్న వారందరికీ ఇళ్లు నిర్మించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఇళ్లు లేని పేదలంతా ఈ నెలాఖరులోపు సమీపంలోని గ్రామ వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు ఇవ్వాలని మంత్రి కోరారు. ప్రతి మూడు నెలలకోసారి గృహ ప్రవేశాలు: సరాసరి 2029 కల్లా అదనంగా 15.59 లక్షల ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పార్థసారథి వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే 3 లక్షల ఇళ్లను నిర్మించి లబ్దిదారులకు అందించామని వివరించారు. ఉగాది కల్లా మరో 5 లక్షల ఇళ్లు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారని తెలిపారు.




పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## చట్టా వ్యాపారం - సుంకాలు - శ్రామిక ప్రజానీకం

మార్కెట్లో ఒకానొక సరుకుకు కొరత ఏర్పడినప్పుడు ఆ సరుకును అక్రమంగా దాచిపెట్టి ఆ కొరతను మరింత పెంచేలా చట్టా వ్యాపారులు చేయగలరు. ఒక్కోసారి ఏ కొరతా లేకపోయినప్పటికీ, కృత్రిమంగా కొరత సృష్టించగలరు కూడా. ఆ సరుకు గనుక నిత్యావసర సరుకు అయితే ఇక శ్రామిక ప్రజానీకం చట్టా వ్యాపారం వలన పడే ఇబ్బందులు ఇన్నీ అన్నీ కావు. ఈ విషయం తెలిసినదే. 1943లో యుద్ధ సమయంలో తూర్పు సరిహద్దులో యుద్ధం జరుగుతున్నప్పుడు ఆ యుద్ధానికి అయ్యే ఖర్చు కోసం బడ్జెట్ లోటును విపరీతంగా పెంచారు. ఆ సమయంలో ఆహార ధాన్యాల కోసం మార్కెట్లో డిమాండ్ బాగా పెరిగింది. సరిగ్గా అప్పుడే టోకు (హోల్‌సేల్) వ్యాపారులు ఆహార ధాన్యాలను నల్ల బజారుకు తరలించారు. దాని పర్యవసానంగా బెంగాల్ కరువు ఏర్పడింది. దానివలన 30 లక్షల మంది చనిపోయారు. ఐతే, ప్రస్తుతం నయా ఉదారవాద విధానాలు అంతకన్నా ఎక్కువగా నష్ట పరుస్తున్నాయి. కేవలం నిత్యావసర సరుకుల విషయంలో జరిగే చట్టా వ్యాపారం ద్వారా మాత్రమే దెబ్బ తీయడంతో సరిపెట్టకుండా, కరెన్సీ మార్కెట్లో జరిగే చట్టా వ్యాపారం ద్వారా నేరుగానే శ్రామిక ప్రజల కొనుగోలుశక్తిని దెబ్బ తీస్తున్నాయి. నయా ఉదారవాద వ్యవస్థలో పెట్టుబడుల రాకపోకల మీద, ముఖ్యంగా ద్రవ్య పెట్టుబడి రాకపోకల మీద ఎటువంటి నియంత్రణలూ లేవు. ఒక దేశపు కరెన్సీకి అంతర్జాతీయ మార్కెట్లో ఉండే మారకపు విలువను ఇప్పుడు మార్కెట్ మాత్రమే నిర్ణయిస్తుంది. అప్పుడు చట్టా వ్యాపారులు ఒక దేశంలో అమెరికన్ డాలర్ల రూపంలో ఉన్న వారి పెట్టుబడు లను వేరే దేశానికి తరలించాలని నిర్ణయించారనుకోండి. దాని ఫలితంగా ఆ దేశపు కరెన్సీ మారకపు రేటు పడిపోతుంది. దాని పర్యవసానంగా ఆ దేశం దిగుమతి చేసుకునే సరుకుల రేట్లు ఆ దేశపు కరెన్సీ లెక్కలో పెరిగిపోతాయి. అలా దిగుమతి చేసుకునే సరుకులు గనుక చమురు వంటి నిత్యావసర సరుకులు అయితే దాని ఫలితంగా ఆ దేశపు ఆర్థిక వ్యవస్థ మీద ఆర్థిక భారం మొత్తంగానే పడుతుంది. అది ద్రవ్యోల్బ ణానికి దారి తీస్తుంది. దానివలన నిజ వేతనాలు పడి పోతాయి. కష్టపడి జీవించే వారందరి నిజ ఆదాయాల విలువలు పడిపోతాయి. ఎక్కువమంది శ్రామిక ప్రజల ఆదాయాలు జీవన వ్యయ సూచికతో ముడిపడి వుండవు. అందువలన వారి నిజ ఆదాయాల్లో కోత మరీ తీవ్రంగా ఉంటుంది. పపంచవ్యాప్తంగా న్న కోట్లాదిమంది శ్రామిక ప్రజల జీవన పరిస్థితులు దురాశాపూరితులైన కొద్దిమంది స్పెక్యులేటర్ల (చట్టా ్యపారుల) దయా దాక్షిణ్యాలమీద ఆధార పడివున్నాయి. ఇదే నయా ఉదారవాద వ్యవస్థ వాస్తవ లక్షణం.

పెట్టుబడులు ఉన్నట్టుండి బైటకు పోయినప్పుడు మన కరెన్సీ మారకపు విలువ పడిపోయి, దిగుమతుల ఖరీదు పెరిగిపోయి, శ్రామిక ప్రజల నిజ ఆదాయాలు దెబ్బ తినడం జరిగినట్టే, దానికి రివర్స్‌లో జరిగితే ఏమౌతుంది? మన దేశంలోకి పెట్టుబడులు ఎక్కువగా వచ్చి, మన కరెన్సీ మారకపు విలువ పెరిగిపోయి శ్రామిక ప్రజల జీవన పరిస్థితులు మెరుగుపడతాయా? అలా జరగదు.

దేశంలోకి పెట్టుబడులు ఎక్కువగా వచ్చిపడినప్పుడు మన కరెన్సీ మారకపు విలువను పెరగనిస్తే- అప్పుడు దిగుమతుల ద్వారా వచ్చే సరుకుల కన్నా దేశీయంగా చేసే ఉత్పత్తులు ఎక్కువ ప్రియం అవుతాయి. అప్పుడు దేశంలో ఉత్పత్తి తగ్గుతుంది. దిగుమతులు పెరుగుతాయి. అలా దిగుమతులు పెరిగితే వాటికోసం చెల్లించవలసిన విదేశీ మారక ద్రవ్యం (డాలర్లు) ఎక్కువ అవసరమౌతుంది. రిజర్వు బ్యాంకు గనుక జోక్యం చేసుకోనట్లయితే- అప్పుడు మన దేశం విదేశీ మదుపరులకు బకాయి పడిపోతుంది. అది కూడా తన దేశంలో పరిశ్రమల్ని మూత వేసుకోవడం కోసం. ఇంతకన్నా అర్థరహితమైన పరిణామం మరొకటి ఉండదు. అందుచేత రిజర్వు బ్యాంకు తప్పనిసరిగా జోక్యం కల్పించుకుంటుంది. మన రూపాయి మారకపు విలువను పెరగనివ్వకుండా చర్యలు తీసుకుంటుంది. అందుకోసం విదేశాలనుండి వచ్చే అదనపు డాలర్లను తన విదేశీమారకపు నిల్వలలోకి మళ్లిస్తుంది. అంటే, మన దేశం నుండి డాలర్లు బైటకు పోతే శ్రామిక ప్రజల నిజ ఆదాయాలు దెబ్బ తింటాయి. అదే మన దేశానికి డాలర్లు అదనంగా వస్తే వాటిని రిజర్వు బ్యాంకు భద్రంగా విదేశీమారకపు నిల్వలుగా దాచి మన రూపాయి మారకపు విలువ పెరగకుండా చూస్తుంది.విదేశీ మారకపు నిల్వలు ఎక్కువగా ఉంటే మంచిదే కదా? ఉన్నట్టుండి మన దేశం నుంచి డాలర్లు బైటకు పోయే పరిస్థితి ఏర్పడినప్పుడు ఆ నిల్వలను విడుదల చేసి మన రూపాయి విలువ పడిపోకుండా నిలబెట్టవచ్చు కదా? ఈ వాదన సరైనదే. కాకపోతే ఇక్కడ ఒక సమస్య ఉంది. రిజర్వు బ్యాంకు తన నిల్వలనుండి డాలర్లను విడుదల చేయడానికి సిద్ధపడినా, దానికి పరిమితి ఉంటుంది. తనవద్ద ఉన్న నిల్వలు అన్నీ ఖాళీ అయిపోయే పరిస్థితిని రానివ్వదు. అంటే రిజర్వు బ్యాంకు విడుదల చేసే విదేశీ మారకద్రవ్య పరిమాణానికి కొంత పరిమితి ఉంటుంది. దానివలన డాలర్లు మన దేశం నుండి బైటకు పోయే స్థితి వచ్చినప్పుడు దాని వలన కలిగే లోటును రిజర్వు బ్యాంకు పూర్తిగా భర్తీ చేయలేదు. అందు వలన రూపాయి మారకపు విలువ పూర్తిగా పడిపోకుండా నిలవరించలేదు. కొంతవరకే దానిని ఆపుతుంది. మారకపు విలువ కొంతవరకూ పడిపోతూ వుంటుంది. కొంతవరకు విదేశీ నిల్వలను రిజర్వు బ్యాంకు విడుదల చేస్తూ వుంటుంది. మొత్తం మీద క్రమంగా రూపాయి మారకపు విలువ పడిపోతూ వుంటుంది. శ్రామిక ప్రజల నిజ ఆదాయాలు తగ్గిపోతూ వుంటాయి. భారతదేశంలో ఇటీవల కాలంలో ఇదే జరుగుతూ వస్తోంది.కొంత కాలం గడిచేసరికి వెనక్కి తిరిగి చూసుకుంటే రూపాయి మారకపు రేటు పడిపోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. 1990 నవంబర్ 10న చంద్రశేఖర్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచీ సరళీకరణ క్రమం మొదలైంది.

## మహిళల పై జరుగుతున్న హింసను వ్యతిరేకిద్దాం : ఐద్వా పిలుపు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను వ్యతిరేకించాలని, ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎన్ మాధవి, వై.సత్యవతి అన్నారు. అంతర్జాతీయ హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా . మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ మహిళలపై, చిన్నారుల పై రోజురోజుకూ అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, క్రైమ్ రేటు విపరీతంగా పెరుగుతోందని అన్నారు. దేశంలో ప్రతి 3 నిమిషాలకు ఒక అఘాయిత్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలపై హింస ఒక సాధారణ అంశంగా రూపు దాల్చడం ఆందోళనకరమన్నారు. పుట్టుక నుండి మరణం వరకు అన్ని దశల్లోనూ స్త్రీలపై హింస హద్దులు దాటిపోతున్నదన్నారు. మహిళలు ఇంటా, బయట ఎక్కడో ఒకచోట ఏదో ఒక రకమైన హింసకు, అకఅత్యాలకు, అవమానాలకు, తీవ్రదూషణలకు, హత్యలకు గురవుతూనే ఉన్నారన్నారు. లైంగికత ఆధారంగా జరుగుతున్న హింసను అరికట్టేందుకు సమాజంలో చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రశాంతంగా ఉండే విశాఖలో సైతం అత్యాచారాలు, గఅహ హింస, వరకట్న వేధింపులు, కిడ్నాప్ కేసులు, ప్రేమ పేరుతో దాడులు, సైబర్ నేరాలు గతం కన్నా పెరిగాయన్నారు. మహిళలపై జరుగుతున్న ఈ అరాచకాలకు కారణమైన మద్యం, డ్రగ్స్, అశ్లీల సాహిత్యం, అశ్లీల వెబ్ సైట్లు కారణమనీ అయితే, మరో పక్క మహిళలపై నేరాలు పెరగడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలు కూడా కారణమని ఆరోపించారు. మణిపూర్ లో మహిళల పై అత్యాచారం చేసి నగంగా ఊరేగించిన సంఘటన, ధర్మస్థలిలో అమ్మాయిలు అదఅశ్యం అవుతూ, వారి మఅతదేహాలు బయటపడటం మనకు తెలుసు అన్నారు. మహిళా రెజ్లర్స్ తమపై లైంగిక వేధింపులు, దాడులు జరుగుతున్నాయని, తమకు రక్షణ కల్పించండి అని పోరాడిన సంఘటనలు, వీటన్నిటిలో%౫% బిజెపి,వారి మిత్రపక్షాలే నిందితులని బట్టబయలైనా వారి మీద ఎటువంటి చర్యలు తీసుకోలేదు సరికదా నేరస్తులను రక్షించే పనిలో మోడీ ప్రభుత్వం ఉందంటే నిజంగా మహిళల పట్ల, వారి రక్షణ పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో మనం అర్థం చేసుకోవచ్చునని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రధానంగా బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల పైన వేధింపులు హింస ఘటనలు పెరిగాయని అన్నారు. ప్రభుత్వం లెక్కలే చెబుతున్నాయన్నారు. మహిళలకు, అమ్మాయిలకు, ఇంట్లో, పని ప్రదేశాలలో, హాస్టల్స్, విద్యాలయాలలో చివరకు దేవాలయాలలో కూడా రక్షణ లేదన్నారు. మహిళలను కేవలం సెక్స్ సింబల్ గా, ద్వితీయ పౌరురాలిగా చూస్తూ వారి పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. మనువాదాన్ని ముందుకు తెచ్చి మహిళలను సాంప్రదాయాల పేరుతో వంటింటికే పరిమితం చేయాలని బిజెపి తన విధానంగా ఎంచుకుందన్నారు. అందుకనే మహిళల పట్ల అకఅత్యాలకు పాల్పడే, నేరస్తులను కాపాడటానికి ఎంతకైనా తెగిస్తున్నారన్నారు. మహిళల రక్షణ కోసం చట్టాలు పటిష్టంగా అమలు చేయవలసిన వారే మహిళలపై నేరాలకు పాల్పడుతూ ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా పదవులలో ఉంటే మహిళకు, బాలికలకు రక్షణ ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. ఇది చాలదన్నట్లు రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఇటీవల గోవా తరహాలో విశాఖ లో కూడా జూదం, క్లబ్ లు, పబ్బుల కల్చర్ రావాలని, అప్పుడే టూరిజం అభివఅద్ధి చెందుతుందని, నిసిగ్గుగా మాట్లాడి మహిళల పట్ల వారి వైఖరిని స్పష్టం చేశారని విమర్శించారు. అందువల్లనే మహిళల కోసం రాజ్యాంగంలో అనేక చట్టాలు ఉన్నప్పటికీ , అవన్నీ కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయన్నారు. మహిళల పట్ల నేరాలకు పాల్పడుతున్నవారు శిక్షల నుంచి తప్పించుకోగలుగుతున్నారన్నారు. మహిళపై నేరాలకు పాల్పడిన వారి కేసులలో విచారణ వేగవంతంగా జరపటం, ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయటం, చట్టాలను పటిష్టంగా అమలు చేయడం, మోసగాళ్ల బారినపడకుండా అమ్మాయిలకు, మహిళలకు అవేర్ నెస్ క్యాంపులు పెట్టడం, మద్యం, డ్రగ్స్ నిషేధించడం వంటి చర్యల వలన మహిళలకు రక్షణ కల్పించడం కొంతవరకైనా సాధ్యపడుతుందని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఆఫీసు బేవర్స్ సిహెచ్ సుమిత్ర, ఆర్.వరలక్ష్మి, కె.వేణు, కె.కుమారి, కె.అనురాధ, కె.మణి, కె.విమల, వి.లక్ష్మి, ఉమా, కె.సంతోషం, వరలక్ష్మి, ఎం.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం




**రోలుగుంట, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కొవ్వూరు గ్రామంలో బాల్య వివాహ నిరోధక చట్టం అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఏపీ సీఎం ఎఫ్ సిబ్బంది కాంతమ్మ మాట్లాడుతూ అబ్బాయిలు 21 సంవత్సరాలు, అమ్మాయిలు 18 సంవత్సరాలు పూర్తి చేయకుండా వివాహం జరగడం నేరంగా పరిగణించబడుతుందని, 18 సంవత్సరాలు నిండని అమ్మాయి, 21 సంవత్సరాలు నిండని అబ్బాయి వివాహం నిషిద్ధమని.ఎవరు బాల్య వివాహాన్ని ప్రోత్సహించినా, నిర్వహించినా, లేదా సహాయపడినా వారు శిక్షార్హులన్నారు. గ్రామ సచివాలయం మహిళా పోలీస్ వరలక్ష్మి మాట్లాడుతూ మైనర్ బాలిక లేదా బాలుడు వివాహం జరిపితే, పెద్దవారికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష మరియు 1 లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తారని,.వివాహాన్ని నిర్వహించే వారు, లేదా దానిని ప్రోత్సహించే వారు కూడా అదే విధంగా శిక్షార్హులు అని కన్నతండ్రి లేదా సంరక్షకుడికి కూడా బాధ్యత ఉంటుంది, తప్పించుకునేందుకు సరైన కారణాలు చెప్పాల్సి ఉంటుందని,. ముఖ్యంగా బాల్య వివాహాల వల్ల పిల్లల ఆరోగ్యం, విద్య, స్వేచ్ఛ, భద్రత ప్రభావితమవుతాయని,.బాలికల హక్కులను, భవిష్యత్తును పరిరక్షించడమే చట్ట లక్ష్యమని ఈ చట్టాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం, పోలీసు, శిక్షణ సంస్థలు కలిసి పనిచేస్తున్నాయని,. ఎవ్వరైనా బాల్య వివాహం జరిగితే స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వవచ్చు, వారు శీఘ్ర చర్య తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో కొవ్వూరు విఆర్పి వై లక్ష్మి. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శతాబ్దాల గాయాలు మానిపోయాయి : మోడీ



**అయోధ్య :** అయోధ్యలో నిర్వహించిన ధ్వజారోహణ కార్యక్రమంతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. బాలరాముడి ఆలయ శిఖరంపై కాషాయ జెండాను ఎగురవేసిన అనంతరం ప్రధాని ప్రసంగించారు. ముందుగా జైశ్రీరామ్ అని నినదించారు. అనంతరం మాట్లాడుతూ భారతీయ సాంస్కృతిక చైతన్యానికి అయోధ్య సాక్షిగా నిలిచిందన్నారు. కోట్లాది మంది కల సాకారమైందన్నారు. శతాబ్దాల నాటి గాయాలు, బాధల నుంచి నేడు ఉపశమనం లభించిందన్నారు. 500 ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారమైందన్నారు. ఈ ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నమస్కరిస్తున్నానన్నారు. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగిందని తెలిపారు. ధర్మధ్వజం కేవలం జెండా కాదు.. భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం అని అభివర్ణించారు. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం ప్రతీక అని అన్నారు. శ్రీరాముడి సిద్ధాంతాలను ఈ జెండా ప్రపంచానికి చాటుతుందని, స్ఫూర్తి, ప్రేరణను ఇస్తుందని, కర్మ, కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మధ్వజం చెబుతుందని మోడీ అన్నారు. పేదలు, దు:ఖితులు లేని సమాజాన్ని మనం ఆకాంక్షిస్తున్నామన్నారు. ఒక వ్యక్తి పురుషోత్తముడిగా ఎలా ఎదిగాడో అయోధ్య చెబుతుందన్నారు. రాముడు కులం చూడడు.. కేవలం భక్తి మాత్రమే చూస్తాడు అని చెప్పాడు. ధర్మధ్వజంపై కోవిదార్ వృక్షం మన ఇతిహాసాల వైభవానికి ప్రతీకగా నిలుస్తుంది అని ప్రధాని తెలిపారు. మన చుట్టూ కొందరు ఇంకా బానిస భావజాలంతో ఉన్నారని, రాముడు ఓ కాల్పనిక వ్యక్తి అని వారు అంటున్నారనీ, అలాంటి బానిస భావజాలం ఉన్న వ్యక్తులకు చోటు ఇవ్వొద్దు అని సూచించారు. భారత్‌లో ప్రతి ఇంట్లో, ప్రతి మనసులో రాముడు ఉన్నాడని అన్నారు. ప్రజాస్వామ్యానికి భారత్ పుట్టినిల్లు అని, ఇది మన డీఎన్ఏలోనే ఉంది అని మోడీ అన్నారు. శతాబ్దాల క్రితమే భారత్‌లో ప్రజాస్వామ్య విధానం ఉందని చెప్పారు. తమిళనాడులోని ఉత్తర మేరూర్ శాసనం ప్రజాస్వామ్యం గురించి చెబుతోందన్నారు. వచ్చే వెయ్యేళ్లు భారత్ తన శక్తిని ప్రపంచానికి చాటాలని, మానవ వికాసానికి అయోధ్య కొత్త నమూనా ఇస్తుంది అని మోడీ ఆకాంక్షించారు.

## బంగాళాఖాతంలో వాయుగుండం.. ఏపీలో 29 నుంచి వర్షాలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** దక్షిణ అండమాన్, మలక్కా జలసంధి వద్ద ఏర్పడిన ఆల్పపీడనం వాయుగుండంగా మారింది. అండమాన్ ప్రాంతానికి 750 కిలోమీటర్ల దూరంలో ఈ వాయుగుండం కొనసాగుతోంది. రాబోయే రెండురోజుల్లో పశ్చిమ వాయువ్య దిశగా పయనించి, మరింతగా బలపడుతుంది. నైరుతి బంగాళఖాతం, దక్షిణ శ్రీలంక సమీపంలో ఉపరితల ఆవర్తనం అల్ప పీడనంగా మారింది. ఈ అల్ప పీడనం ఉత్తర వాయువ్య దిశగా ప్రయాణించి మరింత బలపడి వాయుగుండంగా మారే ఆవకాశం ఉందని విశాఖపట్నం తుఫాను హెచ్చరికల కేంద్రం అధికారి తెలిపారు. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా ప్రాంతంలో విస్తారంగా వర్షాలు పడే అవకాశాలున్నాయన్నారు. గురువారం నుంచి మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరించింది. మరోవైపు దక్షిణ అండమాన్, మలక్కా జలసంధి వద్ద ఏర్పడిన ఆల్పపీడనం వాయుగుండంగా మారింది. అండమాన్ ప్రాంతానికి 750 కిలోమీటర్ల దూరంలో ఈ వాయుగుండం కొనసాగుతోంది. రాబోయే రెండురోజుల్లో పశ్చిమ వాయువ్య దిశగా పయనించి, మరింతగా బలపడుతుంది. దీని ప్రభావంతో నవంబర్ 29 నుంచి డిసెంబర్ 2వ తేద వరకు కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు విశాఖపట్నం తుఫాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. ప్రస్తుతం ఈ వాయుగుండం మలేసియాలోని జార్జ్‌టౌన్‌కు 70 కి.మీ. దూరంలోనూ, ఇండోనేసియాలోని కుటామక్మ్యూర్‌కు 290 కి.మీ. దూరంలోనూ, అండమాన్ నికోబార్ దీవులకు 750 కి.మీ. దూరంలోనూ కేంద్రీకృతమై ఉంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో రైతులు అప్రమత్తమై వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

## హిందూ సమ్మేళనం పురస్కరించుకొని సామూహిక హారతి



**రోలుగుంట, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం వెలం కాయల పాలెం గ్రామంలో డిసెంబర్ ఒకటో తారీఖున సామూహిక హారతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోటవురట్ల చత్రపతి శివాజీ హిందూ సేన అధ్యక్షులు నక్కా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో హిందువులందరూ ఏకం కావాలని, అన్యమతస్తులు మన పై జరిపే దాడులను ప్రతి ఒక్కరూ గమనించి హిందువుల ఐక్యత గురించి పోరాడాలని తెలిపారు. అలాగే డిసెంబర్ ఒకటవ తారీఖున కోట ఉరట్లలో జరిగే హిందూ మహాసమ్మేళనానికి ప్రతి ఒక్కరూ పాల్గొని హిందువుల ఐక్యతను నిరూపించుకోవాలని, కోరారు. కార్యక్రమంలో భాగంగా గ్రామములోని స్త్రీమూర్తులందరూ కార్యక్రమానికి సంఘీభావం తెలుపుతూ హారతినిచ్చారు. ఈ యొక్క కార్యక్రమానికి గ్రామంలోని యువకులు, పెద్దలు, స్త్రీమూర్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తాగునీటి కోసం శరభగూడ మహిళల నిరసన



**అరకులోయ, పతాకం న్యూస్:** పచ్చని కొండల మధ్య పాటలు పాడుకునే ఈ అందాల అరకులోయలో ఇప్పుడు వినిపిస్తున్న శబ్దం ఖాళీ కుండల గలగల, పిల్లల ఏడుపు, తల్లుల గొంతులోంచి వచ్చే గర్జన. మండల కేంద్రంలోని శరభగూడ హౌసింగ్ కాలనీలో ఉదయం నుంచి ఒక రోదనే వినిపిస్తోంది.చేతికి కుండ పట్టుకుని నిలబడిన శరభగూడ వాసులు కన్నీటితో వాపోయారు. "పర్యాటకుల కోసం లైట్లు, రోడ్లు, హోటల్స్,అంతా బాగుంది.మాకు మాత్రం తాగే నీళ్లు కూడా లేవా? అని పంచాయతీ అధికారులపై మండిపడ్డారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ మంగళవారం సరభగుడ హౌసింగ్ కాలనీలోని నీటి కుళాయి వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఖాళీ కుండలు, డ్రమ్ములు పట్టుకుని వచ్చిన మహిళలు, యువత "నీళ్లు లేక గొంతు ఎండిపోతోంది. తక్షణమే మంచినీళ్లు ఇవ్వండి" అంటూ నినాదాలు చేశారు.సి కాలనీ, బి కాలనీ, పోస్టాఫీస్ కాలనీ, శరభగుడ హౌసింగ్, రెంటల్ హౌసింగ్, ప్రభుత్వ ఆసుపత్రి కాలనీ, ఆదివాసీ కాలనీ, కొండవీధి సహా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఒక్క చుక్క నీరు కూడా రావడం లేదని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ తెలిపారు."లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్న అరకు రక్షిత మంచినీటి పథకం పేరుతో మరమ్మతులు, నిర్వహణ పేరుతో డబ్బు కొట్టేస్తున్నారు కానీ శాశ్వత పరిష్కారం మాత్రం జరగడం లేదు. ఈ నిర్లక్ష్యం ఇక కొనసాగనియ్యదు. తక్షణమే అధికారులు స్పందించి నీటి సరఫరా పునరుద్ధరించకపోతే ప్రజలందరితో కలిసి తీవ్ర ఉద్యమం చేపడతామని హెచ్చరిస్తున్నాం" అని బాలదేవ్ హెచ్చరించారు.ఈ నిరసనలో శరభగుడ హౌసింగ్ కాలనీ మహిళలు పూర్ణిమ, వరహాలమ్మ, కాసులమ్మ, లక్ష్మి, శాంతి, బుజ్జి, డొమిని, యువకులు శ్రీను కుమార్, జనార్ధన్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సింహాచలం దేవస్థానంలో ప్రధాన అర్చకత్వంపై వివాదం



**సింహాచలం, పతాకం న్యూస్:** సింహాచలం దేవస్థానంలో ప్రధాన అర్చక పోస్టుపై మూడేళ్లుగా వివాదం నడుస్తోంది. దీనిపై హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, వాటిని దేవస్థానం అధికారులు అమలు చేయడం లేదు. తాజాగా దేవదాయ శాఖ కమిషనర్ లేఖ రాసినా సరే ఇక్కడి అధికారుల్లో చలనం లేదు. ఇది కోర్టు ధిక్కారం కిందకు వస్తుందని తెలిసినా పట్టనట్టు ఉంటున్నారు. దీని వెనుక ఆలయంలో కొన్ని దశాబ్దాలుగా పాతుకపోయిన ఒక ఏఈఓ హస్తం ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకుల పోస్టు కోసం 2022లో సీనియారిటీ జాబితా రూపొందించారు. ఉప ప్రధాన అర్చకులుగా ఉండేవారికి అవకాశం కల్పించడం ఆనవాయితీ. అప్పటికే ఇన్‌చార్జి ప్రధాన అర్చక పోస్టులో కేకే శ్రీనివాస ప్రసాదాచార్యులు పనిచేస్తున్నారు. ఆయన్ను కాదని ఉప ప్రధాన అర్చకులుగా ఉన్న గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవీ రమణాచార్యులకు పదోన్నతి కల్పించారు. దీనిపై ఇన్‌చార్జి ప్రధాన అర్చకులు హైకోర్టును ఆశ్రయించారు. అందులో ఆయన కొన్ని అంశాలు ప్రస్తావించారు. గొడవర్తి శ్రీనివాసాచార్యులు 2001 నుంచి 2009 వరకు విదేశాలకు వెళ్లి అక్కడ అర్చకత్వం ఉద్యోగాలు చేశారని పేర్కొన్నారు. దానికి సెలవులు ఇచ్చినట్టు సర్వీసు రికార్డులో నమోదైందని కోర్టుకు సమర్పించారు. ఆ తరువాత కూడా పలుమార్లు ఆయన విదేశీయానం చేశారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్ సర్క్యులర్ 2010 ప్రకారం విదేశీ యానం చేసిన వారు గర్భగుడిలో అర్చక విధులు నిర్వహించకూడదని, ఈ విషయం తెలిసి కూడా నాటి దేవస్థానం ఈఓ పదోన్నతి కల్పించారని పిటిషనర్ పేర్కొన్నారు. ఇదిలావుండగా ఈ కేసులో రెండో ప్రధాన అర్చకులైన రమణాచార్యులు కొద్దినెలల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. దాంతో ఇప్పుడు కేసు ప్రధానంగా గొడవర్తి శ్రీనివాసాచార్యులపైనే నడుస్తోంది. సీనియారిటీ జాబితా తయారు చేస్తున్నప్పుడే తాను ఈ అభ్యంతరాలన్నీ ఆలయ ఈఓ దృష్టికి తీసుకువెళ్లానని, కానీ పట్టించుకోలేదని శ్రీనివాస ప్రసాదాచార్యులు ఆరోపిస్తున్నారు. తనను అదే ఇన్‌చార్జి ప్రధాన అర్చక పోస్టులో ఉంచేసి, ఉప ప్రధాన అర్చకులు ఇద్దరికీ ప్రధాన అర్చకులుగా పదోన్నతులు కల్పిస్తూ 2022 సెప్టెంబరు 18న ఆదేశాలు ఇచ్చి, అమలు చేశారని పేర్కొన్నారు. దీనిపై న్యాయం చేయాలని హైకోర్టును కోరగా, ఆయన చెప్పిన విషయాలను పరిగణనలోకి తీసుకొని నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయంలోగా చర్యలు తీసుకోవాలని 2025 సెప్టెంబరు 18న ఆదేశాలు ఇచ్చింది. దీనిని దేవస్థానం ఈఓ ఇప్పటివరకూ అమలు చేయలేదు. దాంతో బాధిత అర్చకులు ఈ నెల 5వ తేదీన దేవదాయ శాఖ కమిషనర్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. కమిషనర్ రామచంద్రమోహన్ వెంటనే దానిపై చర్యలు తీసుకొని తనకు నివేదిక పంపాలని ఈఓ సుజాతను ఆదేశిస్తూ ఈ నెల 18న ఉత్తర్వులు పంపించారు. ఇప్పటివరకూ వాటిని అధికారులు ముట్టుకోలేదు.

# దర్జాగా స్టీల్‌ప్లాంటు భూమి కబ్జా

## ఆక్రమణలను తొలగించిన పెదగంట్యాడ మండల రెవెన్యూ అధికారులు



**గాజువాక, పతాకం న్యూస్:** కోట్లాది రూపాయల విలువైన స్టీల్‌ప్లాంటు స్థలాన్ని కొందరు కబ్జా చేసి, అర్ధరాత్రి సమయంలో పునాదులు నిర్మించడమే కాకుండా ఓ కాలనీ పేరుతో బోర్డును కూడా ఏర్పాటు చేసేశారు. వివరాల్లోకి వెళితే.... స్టీల్‌ప్లాంటుకు పెదగంట్యాడ మండలం వికాస్‌నగర్ ప్రభుత్వ న్యూ ఐటీఐ ముఖద్వారానికి ఆనుకుని ఉన్న సర్వే నంబరు 53లో అరఎకరా స్థలం ఉంది. అక్కడ గజం ధర సుమారు రూ.40 వేల వరకు ఉంది. కాలనీ మధ్యలో ఉన్న విలువైన స్థలంలో ప్రజోపయోగ కార్యక్రమాలకు ఉపయోగపడే భవనాలు నిర్మించే అవకాశం ఉన్నప్పటికీ స్టీల్‌ప్లాంటు యాజమాన్యం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో దానిపై కబ్జాదారుల కన్ను పడింది. దీనికి స్టీల్‌ప్లాంటు భూ సేకరణ విభాగం అధికారులు పరోక్షంగా సహకరించినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో వంద మందికి పైగా ఆ స్థలం వద్దకు చేరుకుని పనులు ప్రారంభించారు. అప్పటికప్పుడు పునాదులు తీసి, మూడు అడుగుల ఎత్తులో గోడల నిర్మాణం చేపట్టారు. ఆదివారం పూర్తిస్థాయిలో షెడ్లు నిర్మించే దిశగా సన్నాహాలు చేసుకున్నారు.

అర్ధరాత్రి సమయంలో సుమారు వంద మందికి పైగా అక్రమ నిర్మాణాలు చేపట్టడాన్ని స్థానికులు గుర్తించారు. అక్కడకు చేరుకుని స్టీల్‌ప్లాంటు భూమిలో రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపట్టడంపై నిరసన తెలిపారు. నేరుగా సంబంధిత అధికారులు ఫిర్యాదు చేశారు. కాగా ఈ కబ్జా వెనుక రాజకీయ ప్రముఖుల హస్తం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. సంబంధిత విభాగాల అధికారులు కూడా సహకరించినట్టు సమాచారం. ఈ విషయమై స్టీల్‌ప్లాంటు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ సునీతను మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు భూముల్లో అక్రమంగా పునాదులు వేసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే సిబ్బందిని పంపి విచారణ చేపట్టామని, 15 మంది కబ్జాకు పాల్పడినట్టు తెలిసిందని, వారికి నోటీసులు ఇచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కాగా న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు మాట్లాడుతూ ఈ అంశాన్ని ప్రస్తావించగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు. స్టీల్‌ప్లాంటు స్థలం వద్దకు శనివారం రాత్రి సుమారు 50 మంది వరకు వచ్చారని సమాచారం అందడంతో వెళ్లామని, అయితే వారంతా పరారయ్యారని తెలిపారు. వెంటనే విషయాన్ని ఎస్‌డీసీ, పెదగంట్యాడ తహశీల్దార్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్లాంటు భూములు కాపాడడంలో భూ సేకరణ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో కబ్జాదారులు బరితెగిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన విషయం పెదగంట్యాడ మండల రెవెన్యూ అధికారులకు తెలియడంతో ఉదయం రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరుకుని కొన్ని ఆక్రమణలను తొలగించారు. అది స్టీల్‌ప్లాంటు భూసేకరణ విభాగానికి చెందిన స్థలమంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. ఆక్రమణదారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# డి. ఎర్రవరం -జిల్లేడుపూడి రహదారి జంగిల్ క్లియరెన్స్ ప్రారంభం



**నాతవరం, పతాకం న్యూస్:** నాతవరం మండలం డీ.ఎర్రవరం నుంచి జిల్లేడుపూడి వరకు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలు, పిచ్చిమొక్కలు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగించాయి. ఈ విషయం తెలుసుకున్న ఎన్‌ఆర్‌ఐ లెక్కల వెంకటేశ్వరరావు స్పందించి సొంత నిధులతో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు. జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర, ఎస్ఐ తారకేశ్వరరావు, ఎంపిడిఒ శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ కలిసి పనులను ప్రారంభించారు. జేసీబీ సాయంతో రహదారి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, తుప్పలను తొలగించడంతో వాహనదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. రహదారి పరిస్థితిపై చాలా కాలంగా చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సందర్భంలో ఎన్‌ఆర్‌ఐ ముందుకు రావడం అభినందనీయమని సూర్యచంద్ర తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎస్‌ఆర్‌ఐ టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 30న గ్లాస్ బ్రిడ్జి ప్రారంభం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** కైలాసగిరిపై నిర్మించిన గ్లాస్ బ్రిడ్జిని ఈ నెల 30వ తేదీన ప్రారంభిస్తున్నట్టు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోల శ్రీబాలవీరాంజనేయస్వామి, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌లు దీనిని ప్రారంభిస్తారని చెప్పారు. ఇది విశాఖపట్నం వచ్చే పర్యాటకులకు మరింత అదనపు ఆకర్షణగా నిలుస్తుందన్నారు.

# గిరిజనుల శ్రమతో సాకారమైన తాత్కాలిక వంతెన ప్రారంభం



**అరకులోయ, పతాకం న్యూస్:** మండల కేంద్రంలోని, సిరగం గ్రామపంచాయతీ పరిధిలోని డెర్ని నుంచి కప్పలుగొంది గ్రామాల మధ్య గల వంతెన మిచాంగ్ తుఫాను ప్రభావంతో కొట్టుకుపోయింది. దీంతో రోజువారీ రాకపోకలు తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో, ఆ గ్రామాల గిరిజన యువత, పెద్దలు ఒక్కటై పెద్ద పెద్ద కర్రలతో వారం రోజుల పాటు శ్రమించి తాత్కాలిక వంతెనను స్వయంగా నిర్మించారు.గ్రామస్తుల ప్రత్యేక ఆహ్వానం మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగం చాణక్య శనివారం ఈ నూతన తాత్కాలిక వంతెనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఎవరో వస్తారు, ఏదో చేస్తారని ఎదురుచూడకుండా, తమ కష్టాలకు తామే పరిష్కారం స్వయంగా చూపుకోవడం గిరిజన సోదరుల ఆత్మస్థైర్యానికి నిదర్శనం" అని కొనియాడారు.అయితే ఈ తాత్కాలిక వంతెన శాశ్వత పరిష్కారం కాదని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి ఆ గ్రామాల మధ్య శాశ్వత వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టి గిరిజనులకు శాశ్వత పరిష్కారం కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రారంభోత్సవం అనంతరం రేగం చాణక్య ద్విచక్ర వాహనంపై ఆ వంతెన మీదుగా ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిల్లో జగన్, వైఎస్సార్సీపీ అరకు నియోజకవర్గ బూత్ కమిటీ ఇన్‌చార్జ్ విజయ్ పాంగి, కమ్మిడి అశోక్,సోబోయి గాసి, పాంగి గోపాల్‌రావు, పాంగి అప్పలస్వామి, కిల్లో రామ్మూర్తి, కిల్లో అప్పలస్వామి, సోబోయి రామ్మూర్తి, వంతల రామ్మూర్తి, మోహన్, రవి, కిల్లో సోమేష్, వంతల రాజారావు, పాంగి రాజారావు, కిల్లో బొంజుబాబు, గ్రామ యువత, చిన్నారులు పాల్గొన్నారు.

# విద్యా ప్రోత్సాహానికి అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ ముందడుగు



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం బలిఘట్టం జెడ్పి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచే లక్ష్యంతో అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ స్థాపకుడు సురేష్ అల్లాడ స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. రాబోయే పబ్లిక్ పరీక్షలకు సిద్ధం కావడంలో ఉపయోగపడేలా 27 మంది విద్యార్థులకు డిసిఈబి స్టడీ మెటీరియల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.శ్రీదేవి, ఉపాధ్యాయుడు ఐ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో మంచి మెటీరియల్ కీలకమని, అందించిన దానితో విద్యార్థులు ప్రయోజనం పొందాలని సురేష్ అల్లాడ ఆకాంక్షించారు. పాఠశాల సిబ్బంది ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు.

# రైవాడ పడవ ఘటనలో మృతి చెందిన భాదిత కుటుంబాలకు పరామర్శించిన వైసీపీ నాయకులు



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** అనంతగిరి మండలంలోని జీనబాడు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు రెండు రోజుల క్రితం రైవాడ జలాశయంలో నాటు పడవ బోల్తా ఘటనలో గల్లంతై మృతి చెందిన బాధిత కుటుంబాలకు అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు కొర్రా సూర్యనారాయణ ఆధ్వర్యంలో నాయకులు సర్పంచ్ మరియు కార్యకర్తలు కలిపి బాధిత కుటంబాలు ఇంటికి వెళ్లి మంగళవారం పరమార్శించారు.బాధిత కుటంబాలు ఒక్కొక్క కుటుంబానికి 5000రూ"చొప్పున ఆర్థికసహాయంచేశారు.

# విద్యార్థులు, ఉద్యోగులకే ఏయూలోకి ప్రవేశం

## బయట వ్యక్తులకు నో ఎంట్రీ




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయంలోకి బయట వ్యక్తులు ప్రవేశించకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రధాన గేటు ద్వారా ఇతరులు వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. అదే సమయంలో వర్సిటీకి సంబంధం లేని వ్యక్తులు రావడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నట్టు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా బయట వ్యక్తులు వసతి గృహాల్లో విద్యార్థులతో గొడవలు పడుతున్నారు. ఇటువంటి వాటిని కట్టడి చేసేందుకు ఉద్యోగులను, విద్యార్థులను మాత్రమే క్యాంపస్‌లోకి అనుమతించాలని సెక్యూరిటీ సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఉద్యోగులు, విద్యార్థులు ఇకపై తప్పనిసరిగా ఐడీ కార్డు ధరించి రావాల్సి ఉంటుంది. ఐడీ కార్డును పరిశీలించిన తరువాత మాత్రమే లోపలకు వెళ్లేందుకు సెక్యూరిటీ సిబ్బంది అనుమతి ఇస్తున్నారు. ఒకవేళ ఇతర కళాశాలలకు చెందిన సిబ్బంది ఎవరైనా పనులు నిమిత్తం వచ్చినట్టయితే అధికారుల అనుమతి తీసుకుని మాత్రమే వారిని లోపలకు అనుమతించనున్నారు. ఈ మేరకు సెక్యూరిటీ సిబ్బందికి అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో సెక్యూరిటీ సిబ్బంది ఈ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేశారు.

## సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశ 53వ ప్రధాన న్యాయమూర్తిగా (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆదివారం పదవీ విరమణ చేసిన సిజెఐ బిఆర్ గవారు స్థానంలో జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరించారు. 2027 ఫిబ్రవరి 9 వరకూ 15 నెలలపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. సిజెఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హర్యానా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ నిలిచారు. ఈ కార్యక్రమంలో తొలిసారిగా భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల ప్రధాన న్యాయమూర్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జెపి నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, పీయూష్ గోయల్, లోక్‌సభ స్పీకరు ఓం బిర్లా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఎన్నాళ్లీ ముంపు కష్టాలు?



**మెళియాపుట్టి, పతాకం న్యూస్:** వర్షం కురిస్తే చాలు.. ఆ మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. నిచ్చుప్పల గెడ్డ పొంగి ప్రవహించి.. బాహ్య ప్రపంచంతో గ్రామస్థులకు సంబంధాలు తెగి పోతాయి. ఎవరికి అనారోగ్యం వచ్చినా.. అత్య వసర వైద్యం అందించాల్సి ఉన్నా.. వరదనీరు తగ్గేవరకు బయటకు రాలేని పరిస్థితి. ఇదీ మెళియాపుట్టి మండలంలోని పెద్దరోకళ్లపల్లి, రామ్‌నగర్, సీతారామపల్లి గ్రామస్థుల దుస్థితి. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురవగా ఈ గ్రామాలు జలదిగ్బం ధంలో చిక్కుకున్నాయి. మూడు రోజులపాటు ఆయా గ్రామస్థులు బయటకు రాలేక ఇబ్బం దులు పడ్డారు. నిచ్చులప్ప గెడ్డ ఉప్పొంగి ప్రవహించడంతో గతంలో నిర్మించిన వంతెన ముంపునకు గురైంది. ఈ గ్రామాలకు నౌపడ ఆర్ఎస్, తలగాం నుంచి రహదారులు ఉన్నా యి. చిన్నపాటి వర్షం కురిసినా గెడ్డలోకి నీరు చేరి.. గ్రామాలు ముంపునకు గురవుతున్నా యి. నందిగాం మండలంలోని దిమిలాడ, నౌగాం ప్రాంతాలో నుంచి అధికంగా నీరువచ్చి గెడ్డలో చేరుతోంది. 40 ఏళ్లుగా ముంపు సమ స్య ఉన్నా అధికారులు, నాయకులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. వర్షాలు కురిసే వేళ బయటకు రావాలంటేనే భయమేస్తోం దని వాపోతున్నారు. వంతెన ఎత్తు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## చేతి వృత్తుల కళాకారులకు పియం విశ్వకర్మ పథకం గొప్ప వరం: బాజపా నేత కేఎన్ఆర్



**గాజువాక, పతాకం న్యూస్:** గాజువాక లయన్స్ క్లబ్ లో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎమ్.ఎస్.ఎమ్.ఈ ఏడి చంద్రమౌళి పియం విశ్వ కర్మ పథకం ఇంచార్జి ఏడి అప్పికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన పియం విశ్వకర్మ పథకం యొక్క లబ్దిదారుల అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా బిజేపి రాష్ట్ర మీడియా పేనలిస్ట్ మరియు గాజువాక ఇంచార్జి డాక్టర్ కరణంరెడ్డి నరసింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ 2047 లక్ష్యం గా ప్రధాని నరేంద్ర మోదీ నిరంతరం పని చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా భారత సాంప్రదాయ, చేతివృత్తుల కళాకారుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పియం విశ్వకర్మ పథకం ద్వారా దేశంలో ఉన్న పద్దెనిమిది రకాల చేతివృత్తుల వారికి ఉచితంగా శిక్షణ ఇస్తూ, వారికి సర్టిఫికెట్, ఐడి కార్డులు జారీ చేయడం జరిగిందని అన్నారు. వారికి ఒక్కొక్కరికి పదిహేను వేల రూపాయల విలువైన వాషింగ్ మెషీన్, కార్పెంటర్ కిట్లు ,వంటి పనిముట్లు పోస్టాఫీసు ద్వారా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ పథకం చేతివృత్తుల కార్మికులకు గొప్ప వరం అని అన్నారు. ఏడి శ్రీనివాస్, చంద్రమౌళి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకారంతో, రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం తరపున ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఇప్పటికే దేశంలో పది లక్షల మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరిందని అన్నారు. లబ్ధిదారులకు ఎటువంటి సందేహాలు ఉన్నా తమ కార్యాలయానికి వచ్చి నివృత్తి చేసుకోవచ్చు అని అన్నారు. అనంతరం లబ్ధిదారుల నుండి పలు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మిన్ సంఘం అధ్యక్షులు శివకోటి శ్రీనివాసరావు, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ శ్రీదేవి, ఆర్‌బిఐ సి ఎఫ్ ఎల్ కో-ఆర్డినేటర్ దీపక్, పిఎం విశ్వకర్మ డీపీఎంఓ కె.త్రినాధ రావు, నాయీ బ్రాహ్మిన్ రాష్ట్ర అధ్యక్షులు ఏ పెంటా రావు, సిటి అధ్యక్షులు ఎ.సుబ్బారావు మరియు నాయకులు కోసూరి తాతారావు, ఒమ్మి రంగనాయకులు, చేబ్రోలు అశోక్,త్రినాథ్,వెన్న శ్రీరామమూర్తి, బొండా యల్లాజీ రావు,రంజిత్, పేర్ల అప్పారావు, ఎస్.రామస్వామి, కొల్లి మనోహర్, కృష్ణంరాజు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 50 ఏళ్లుగా రహదారి లేక కష్టాలు పడుతున్న జలగలాగెడ్డ ప్రజలు



**చింతపల్లి, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా,చింతపల్లి మండలం, లమ్మసింగి పంచాయతీ పరిధిలోని జలగలగెడ్డ గ్రామం ప్రజలు స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్లు దాటినా,తమకు మాత్రం రహదారి సౌకర్యం అందలేదని వేదన వ్యక్తం చేస్తున్నారు.50 ఏళ్లకుపైగా ఈ గ్రామం రోడ్డు లేకపోవడంతో అడ్డంకులను,ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటోంది.సుమారు 100 మందికి పైగా జనాభా ఉన్న ఈ గ్రామంలో పీఎం జన్మన్ హౌసింగ్‌లో 20 మంది లబ్దిదారులు ఉన్నప్పటికీ,రహదారి లేకపోవడంతో ఇళ్లు నిర్మించడానికి కావాల్సిన సామాగ్రిని భుజం మీద,నెత్తి మీద మోస్తూ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన పరిస్థితి.అయితే కొర్రుబయలు గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు మార్గాన్ని సిమెంట్ స్తంభాలతో కంచె వేసి అడ్డగించడం వల్ల ఇబ్బందులు మరింత పెరిగాయి.ఈ సమస్యను గుర్తించిన హౌసింగ్ పీడీ గ్రామాన్ని సందర్శించిపై అధికారులకు నివేదించగా,జిల్లా కలెక్టర్ స్పందించి రూ.90 లక్షల వ్యయంతో బిటి రహదారి మంజూరు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.రహదారి లేక పంట దినుసులను మార్కెటుకు తరలించడానికి రహదారి లేకపోవడం, అత్యవసర వైద్యసేవల కోసం ఆసుపత్రికి చేరుకునేందుకు ఆలస్యం కావడం వంటి కారణాల వల్ల ఎన్నోసార్లు ప్రాణనష్టం జరిగిందని గ్రామస్తులు బాధతో చెప్పారు. ఇటీవలే కొర్ర నీలమ్మ అనే మహిళ పాముకాటు గురవగా రహదారి లేక ఆలస్యంగా ప్రాంతీయ ఆసుపత్రికి,అక్కడ నుండి కేజీహెచ్ కి తరలించిన విషం కిడ్నీలకు చేరి మరణించిన దుర్ఘటన గ్రామంలో కలకలం రేపింది.పిల్లలు పాఠశాలకు వెళ్లడంలోనూ ఇలాంటి సమస్యలే ఎదురవుతున్నాయి. కొండ ప్రాంతం కావడం చేత గ్రామం నుండి చెరువులవేణం గ్రామం వరకు రహదారి ఏర్పడితే లమ్మసింగి వ్యూ పాయింట్‌కు ప్రత్యామ్నాయ మార్గం కూడా సిద్ధమవుతుందని వారు పేర్కొన్నారు. జలగలగెడ్డ గ్రామం కొండపై మొదటి వ్యూ పాయింట్‌గాను గుర్తింపుపొందింది.రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఆగని ఇసుక దందా

### కొమరాడ, పాలకొండ మండలాల్లో భారీగా తవ్వకాలు



**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలో ఇసుక దందా ఆగడం లేదు. అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేపట్టి తరలించుకుపోతున్నారు. ముఖ్యంగా కొమరాడ, పాలకొండ మండలాల్లో భారీగా తవ్వకాలు జరుగుతున్నాయి. దీనివెనుక కొందరు టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తుండడంతో ఇసుకాసురులు మరింతగా రెచ్చిపోతున్నారు. జిల్లాలోని నదులు, గెడ్డలు, చెరువులను అక్రమార్కులు గుల్ల చేసేవారు. ముఖ్యంగా కొమరాడ మండలంలోని కోనేరు రామభద్రపురం, పాలకొండ మండలం అంపిలి, అన్నవరం, గొట్టమంగళాపురం తదితర ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేసేవారు. వైసీపీ నాయకులు ప్రకృతిని వదలడం లేదని, పంచభూతాలను దోచుకుంటున్నారని అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు ఆందోళనలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇసుక దందాకు అడ్డుకట్ట పడుతుందని అంతా భావించారు. కానీ, టీడీపీకి చెందిన కొందరు ద్వితీయ శ్రేణి నాయకులే తెరవెనుక ఉండి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. కొమరాడ మండలంలోని కోనేరు రామభద్రపురం రీచ్ నుంచి ఇసుక తరలింపు కోసం వైసీపీ నాయకులకు టీడీపీ నేతలు పూర్తిస్థాయిలో సహకారాలు అందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణాలో గత పాలకులకు తామేమీ తక్కువ కాదని నిరూపించుకుంటున్నారు. ఈ రీచ్ నుంచి ఈ నెల 18వ తేదీన 20 లారీల ఇసుకను అక్రమంగా తరలించినట్లు ప్రజలు చెబుతున్నారు. దీంతో తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది ఆ రీచ్‌ను పరిశీలించారు. అయితే, అక్కడ ఎలాంటి యంత్రాలు లేవని చెప్పి వారు తిరిగి వెళ్లిపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాలకొండ నియోజకవర్గంలో అంపిలి, అన్నవరం, గొట్టమంగళాపురం తదితర ప్రాంతాల్లో కూడా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు. దీనిపై పాలకొండ తహసీల్దార్ రాధాకృష్ణ మాట్లాడుతూ 'ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై ఫిర్యాదులు అందిన వెంటనే ర్యాంప్‌ల వద్దకు వెళ్లి పరిశీలిస్తున్నాం. ఆ ప్రాంతంలో ప్రత్యేకించి ట్రెంచ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకునేందుకు మా సిబ్బందిని అందుబాటులో ఉంచుతాం.' అని తెలిపారు.

## అడ్డాంలో మాజీ మంత్రి గంటా జన్మదిన వారోత్సవాలు



**కశింకోట, పతాకం న్యూస్:** కశింకోట మండలం లో మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాల్లో భాగంగా గంటా యువసేన ఆధ్వర్యంలో కసింకోట మండలం అడ్డాం గ్రామంలో 50 మంది వృద్ధులకు వికలాంగులకు దుప్పట్లు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, కసింకోట పిఎసిఎస్ చైర్మన్ సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, పాల్గొన్నారు. ముందుగా రమణమూర్తి, శ్రీనివాసరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాలు భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గంటా యువసేన కన్వీనర్లు గొంతీన గంగాధర్, జెర్రిపోతులు నూకునాయుడు లను అభినందించారు. ఇలాగే ప్రతి ఒక్కరు సేవా దృక్పథంతో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. అనంతరం వీరు చేతుల మీదగా దుప్పట్లు బియ్యం పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఐ తెలుగుదేశం అధ్యక్షులు, గంటా యువసేన కన్వీనర్ జెర్రిపోతుల నూకు నాయుడు, గంటా యువసేన కన్వీనర్ గొంతిన గంగాధర్, మాజీ డిసిసిబి డైరెక్టర్ ఆంద్ర ప్రసాద్, మాజీ సర్పంచ్ రెడ్డి కన్నబాబు, బిజెపి నాయకులు గుంటూరు మణిరాజు, మండల తెలుగు యువత అధ్యక్షులు ఉగ్గిని నాయుడు బాబు, మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కుంద్రపు ప్రదీప్, ఐటీడీపీలు సెక్రెటరీ వీరబ్రహ్మం రామకృష్ణ, భీమవరం పాల సంఘం అధ్యక్షులు తురకలపూడి రాజబాబు, ఎస్ఎం నాయుడు, మండల తెలుగు యువత కార్యదర్శి గొంతన ప్రసాద్, తెలుగు యువత నాయకులు రెడ్డి శివ, డాక్టర్ సెల్ ఉపాధ్యక్షులు కోనేటి శివ, తెలుగు నాయకులు పరవాడ రమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఐటీడీఏలో అక్రమాలపై నేడు విచారణ




**సీతంపేట, పతాకం న్యూస్:** సీతంపేట ఐటీడీఏలో ముగ్గురు అధికారుల అవినీతి, అక్రమాలపై విచారణకు రంగం సిద్ధమైంది. ఐటీడీఏ పరిధిలో జరిగిన అక్రమాలపై దళిత సంఘాల జేఏసీ ఫిర్యాదు మేరకు ఈ నెల 26న విచారణ చేపట్టాలని గిరిజన సంక్షేమ డైరెక్టర్ ఆదేశించారు. ఇందుకు సంబంధించి ట్రైకార్ ఎండీ సీఏ మణికుమార్‌ను దర్యాప్తు అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. గత ప్రభుత్వ హయాంలో ఐటీడీఏ పరిధిలోని సీఆర్టీల రెగ్యులైజేషన్‌లో అవకతవకలు జరిగాయి. కొంతమంది దగ్గర డబ్బులు తీసుకొని బ్రేక్ సర్వీస్ ఉన్న వారికి కూడా రెగ్యులరైజ్ చేశారు. జువైనెల్ ఏపీ హైకోర్టు ఆదేశాలకు భిన్నంగా అక్రమ బదిలీలు, డిప్యుటేషన్లు చేపట్టారు. ఈ ఏడాది మే నెలలో జరిగిన బదిలీల్లో అధికారులకు అనుకూలంగా ఉన్నవారికి కోరుకున్నచోట స్థానాలు ఇచ్చారు. టెక్కలి ఆశ్రమ పాఠశాలలో సీనియర్ జాబితాలో ఆరవ స్థానంలో ఉన్న ఉపాధ్యాయుడికి స్థానం ఇవ్వకుండా, 64వ స్థానంలో ఉన్నవారికి అవకాశం ఇచ్చారు. బాలికల పాఠశాలలకు పురుష టీచర్లను నియమించారు. బదిలీల తర్వాత అనేకమందికి అక్రమ డిప్యుటేషన్లు కూడా వేశారు. బందపల్లి బాలికల పాఠశాల నుంచి మహిళా టీచర్‌ను టెక్కలి బాయ్స్ స్కూల్‌కి, టెక్కలిలో ఉన్న ఉపాధ్యాయుడిని బందపల్లి గర్ల్స్ స్కూల్‌కి డిప్యుటేషన్ వేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా మెళియాపుట్టి ఏటీడబ్ల్యూవోను, స్కూల్ అసిస్టెంట్లను, డిప్యూటీ వార్డెన్లను నియమించారు. గత ప్రాజెక్ట్ అధికారి కాలంలో టెండర్లు లేకుండా మెస్‌లు, గ్యాస్‌స్టౌవ్‌లు తదితర సామగ్రి కొనుగోలు చేశారు. పాఠశాలల్లో మెస్‌లు బిగించడానికి ప్రధానోపాధ్యాయులకు వేలాది రూపాయలు ఖర్చయ్యాయి. వాటిని ఐటీడీఏ అధికారులు ఇవ్వలేదు. నిధులు దుర్వినియోగం చేశారని దళిత సంఘాల జేఏసీ సభ్యులు ఆరోపించారు. వీటిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఇటీవల విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఐటీడీఏ పరిధిలోని ఏపీవో జి.చిన్నబాబు, డిప్యూటీ డైరెక్టర్ అన్నదొర, సూపరింటెండెంట్ కె.దేస్‌పై ఉన్నతాధికారులు బుధవారం విచారణ చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఫైళ్లతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. బుధవారం ఉదయం 11గంటలకు దర్యాప్తు జరుగుతుందని ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు.

## డిజిటల్ మార్కెటింగ్ ఐదు రోజుల వర్క్ షాప్



**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా, కొయ్యూరు మండలం,మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నందు 24-నవంబర్ నుండి,పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.చిట్టబ్బాయి ఆధ్వర్యంలో డిజిటల్ మార్కెటింగ్ కోర్స్ నిర్వహించారు.పీఎం ఉషా పథకంలో భాగంగా విద్యార్థినుల కోసం వర్క్‌షాప్ ప్రారంభమైంది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుధ మాట్లాడుతూ విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని డిజిటల్ రంగంలో తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రస్తుత ఉద్యోగావకాశాల్లో డిజిటల్ టెక్నాలజీకి పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని ఈ తరహా శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ఆమె పేర్కొన్నారు.కార్యక్రమంలో కోఆర్డినేటర్ బోండ్ల శేఖర్,భౌతిక శాస్త్ర అధ్యాపకులు డా.డి.రాజుబాబు,ఎల్. కృష్ణకాంత్ పాల్గొని విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు.వర్క్‌షాప్‌లో ఇంట్రడక్షన్ టు డిజిటల్ మార్కెటింగ్, వెబ్‌సైట్ ప్రణాళిక %ఙ% నిర్మాణం,ఎస్ఇవో, ఈ-మెయిల్ మార్కెటింగ్,సోషల్ మీడియా మార్కెటింగ్,మొబైల్ మార్కెటింగ్ వంటి అంశాలను పూర్తి వివరాలతో బోధించనున్నట్లు వారు తెలిపారు. విద్యార్థినుల డిజిటల్ నైపుణ్యాభివృద్ధికి దోహదపడే ఈ వర్క్‌షాప్‌లో కళాశాల విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

## కొలిక్కిరాని జిల్లాల పునర్విభజన




**అమరావతి, పతాకం న్యూస్:** జిల్లాల పునర్విభజన, కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు, మండలాల భౌగోళిక స్వరూపాల మార్పు, పాలనాపరమైన సౌలభ్యం వంటి కీలకాంశాలపై సిఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన కేబినెట్ సబ్‌కమిటీ, అధికారులతో సమీక్షా సమావేశం ఎటువంటి నిర్ణయాన్ని తీసుకోలేదు. దీంతో మంగళవారం మరోసారి భేటీ కావాలని నిర్ణయించినట్లు సమాచారం. మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికే సమర్పించిన ప్రతిపాదనలపై మరోసారి అధ్యయనం చేయాలని సిఎం మంత్రులకు సూచించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఆర్డినెన్స్ ద్వారా మదనపల్లె, మార్కాపురం జిల్లాలు నూతనంగా ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు సమాచారం. ఈనెల 28న జరుగునున్న కేబినెట్ సమావేశంలో కూలంకషంగా చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పినట్లు తెలిసింది. గిరిజన ప్రాంతాలు అధికంగా ఉన్న ప్రాంతాన్ని అంతా కలిపి ప్రత్యేకంగా ఒక గిరిజన జిల్లాను ఏర్పాటు చేయాలని, ప్రజలు కోరుకుంటుండగా, ప్రభుత్వం ఆ దిశగా కాకుండా రంపచోడవరం కేంద్రంగా డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అథారిటీలో ఐఎఎస్ స్థాయి అధికారిని నియమించడం ద్వారా పరిపాలనా సౌలభ్యం సులభంగా ఉంటుందని అంచనావేస్తున్నారు. అంతేకాకుండా పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లోని బాధితులకు పునరావాసకేంద్రాలు, ఆర్‌ఓఆర్ అమలుతోపాటు, ప్రభుత్వం విడుదల చేసే నిధులు స్థానికంగా గిరిజనులకు అందించేందుకు డెవలప్‌మెంట్ అథారిటీ ఉపయోగపడుతుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇది ఇలా ఉంటే ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛందసేవా సంస్థలు, రాజకీయ నేతల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మార్పులు, చేర్పులు విషయంపై పెద్ద సంఖ్యలో వినతులు అందాయి. ఇందులో ప్రభుత్వ పరిశీలనలో ఆరు రెవెన్యూడివిజన్లు ఏర్పాటు చేయాలని అనుకుంటున్నప్పటికీ భౌగోళిక,స్థానిక పరిస్థితుల దృష్ట్యా, వాటిని రెంటికి కుదించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. బాపట్ల జిల్లాలో ఉన్న అద్దంకిని ఉమ్మడి ప్రకాశం జిల్లాలోకి, తిరుపతి జిల్లాలోని గూడూరును ఉమ్మడి నెల్లూరు జిల్లాలోకి మార్చేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇక విజయవాడ విషయానికి వస్తే పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల పరిస్థితి ప్రభుత్వానికి తలనొప్పిగా మారడంతో ఈ సమస్యకు ఇప్పట్లో పరిష్కారం దొరికే అవకాశాలు లేవని తెలిసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కందుకూరు ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో కలిపారు. అక్కడి ప్రజలు , ప్రజాప్రతినిధులు గతంలో మాదిరిగానే ప్రకాశం జిల్లాలో కలపాలనే వత్తిడి ఉన్నప్పటికీ రామాయపట్నం పోర్టు దృష్ట్యా ప్రకాశంలో కలిపితే పాలనాపరమైన ఇబ్బందులు తప్పవనే ఆలోచన నేపథ్యంలో కందుకూరు విషయంలో ఎటూ తేల్చుకోలేక పోతున్నట్లు సమాచారం.

## బెంగళూరులో ఏపీ యువతి దారుణ హత్య.. స్నేహితుడి ఘాతుకం!





**అమరావతి, పతాకం న్యూస్:** కర్ణాటక రాజధాని బెంగళూరులో చదువుకుంటున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువతి దారుణ హత్యకు గురైంది. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం, బిక్కంగారిపల్లికి చెందిన దేవశ్రీ (21) అనే విద్యార్థినిని నిందితుడు అత్యంత కిరాతకంగా చంపేశాడు. ఉన్నత చదువులతో ఉజ్వల భవిష్యత్తును ఊహించుకున్న ఆ తల్లిదండ్రులకు తీరని శోకం మిగిలింది. వివరాల్లోకి వెళితే.. రెడ్డెప్ప, జగదాంబ దంపతుల కుమార్తె అయిన దేవశ్రీ బెంగళూరులోని ఆచార్య కళాశాలలో బీబీఏ నాలుగో సంవత్సరం చదువుతోంది. చదువు నిమిత్తం అక్కడే ఓ అద్దె గదిలో నివసిస్తోంది. ఆమెకు సన్నిహితుడైన చిత్తూరు జిల్లా చౌడేపల్లికి చెందిన ప్రేమ్ వర్ధన్ అనే యువకుడు ఈ హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. దేవశ్రీ తలపై బలంగా మోది హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఘటన అనంతరం నిందితుడు పరారయ్యాడు. మదనాయనకహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న ప్రేమ్ వర్ధన్ కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. చదువు పూర్తి చేసుకుని పట్టాతో ఇంటికి వస్తుందనుకున్న కుమార్తె విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వారి రోదనలు ఇరుగుపొరుగు వారి హృదయాలను కలచివేస్తున్నాయి.

## ఉపాధి సామాజిక తనిఖీకి సమన్వయ సమావేశం

**కోనసీమ, పతాకం న్యూస్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండల పరిధిలో 18 గ్రామ పంచాయతీలలో 2024 - 25 వార్షిక సంవత్సరంలో జరిగిన పనులు మీద 18 వ విడత సామాజిక తనిఖీ నిర్వహించేందుకు మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఏ.రాజు ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామాల పరిధిలో పారదర్శకంగా జరగాలని ఆయన సూచించారు. ఉపాధి పనుల నిమిత్తం ఖర్చు చేసిన నిధుల వివరాలు ఆడిట్ అధికారులకు సక్రమంగా అందజేయాలన్నారు. అలాగే వాటి నిజ నిర్ధారణకు అన్ని శాఖల సిబ్బంది సహకరించాలని ఆయన ఆదేశించారు. దీని నిమిత్తం ఎవరు కూడా ఎటువంటి అవకతవకలకు పాల్పడవద్దని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఏపీవో అరుణకుమారి, పశు వైద్యాధికారి డాక్టర్ వినోద్ కుమార్, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీలు, పంచాయితీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, ఉపాధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాజమహేంద్రవరంలో ఈఎస్ఐ ఆసుపత్రిలో

# మందులు కరువు




**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా రాజమహేంద్రవరంలో కార్మిక ప్రభుత్వ బీమా వైద్యశాల (ఈఎస్ఐ ఆస్పత్రి) నూతన భవనం అందుబాటులోకి వచ్చిందని ఆ భవనాన్ని చూసి సంబర పడడం తప్ప ఆస్పత్రికి పట్టిన రుగ్మతలకు చికి త్స జరగడం లేదు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ మురళీ మోహన్ చొరవతో పునాది రాయి పడింది. తర్వాత వైసీపీ ప్రభుత్వంలో పనులు నత్తనడకన సాగా యి. మూడేళ్ల ఆపసోపాల తర్వాత ఈ జూలైలో గుట్టుచప్పుడు కాకుండా ప్రారంభమైనా పూర్తి స్థాయిలో వైద్య సదుపాయాలు అందుబాటులోకి రాలేదు. ఈఎస్ఐ ఆస్పత్రికి రోజూ 120 వరకూ ఓపీ ఉంటుంది. ఈఎస్ఐలో కార్మికులు, వారి కుటుంబాలకు వైద్యం అందించాల్సి ఉంటుంది. ఈ కార్మికులు అందరూ రూ.20వేలలోపు వేత నం కలిగిన వాళ్లే ఉంటారు. దీంతో మందులు లేకపోవడంతో బయట కొనుక్కోవాల్సి వస్తోంది. డాక్టర్లు రాసిన మందుల్లో చాలా మటుకు అం దుబాటులో ఉండకపోవడం వారికి తలపోటుగా మారింది. మందులు దాదాపుగా నిండుకొని ఆరు నెలలవుతోంది. ఇప్పుడు రూ.4కోట్ల విలువై న 200పైగా మందుల జాబితాతో ఇండెంట్ రెడీ చేశారు. వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత వస్తే అదృష్టమనే చెప్పాలి. ఈ పరిస్థి తుల్లో ఇప్పుడు ఫార్మసీలో ఉన్న కొద్దిపాటి మం దులనే పంపిణీ చేస్తున్నారు. వాటిలో చాలా వరకూ ఒకటి, రెండు నెలల్లో కాలదోషం పట్టేవే ఉంటున్నాయి. కనీసం కాల్షియం బిళ్లలు కూడా లేవంటే దుస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఆస్పత్రి నిర్మాణానికి రూ.97.98 కోట్లను 2020 ఆగస్టు 19న కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిం ది. అయితే 5.83 ఎకరాల విస్తీర్ణంలో రూ.56కోట్ల వ్యయంతో ఈ ఆస్పత్రిని నిర్మించారు. ఆస్పత్రి జీం2 ఫ్లోర్లతో 13376 చదరపు మీటర్లలో ఉండ గా, మార్చురీ భవనం 77.40 చదరపు మీటర్లలో నిర్మించారు. వాస్తవానికి 2022 జూలై 10కి నిర్మా ణం పూర్తి కావాల్సి ఉన్నా 2024 డిసెంబరు 30కి పూర్తయింది. ఆరు నెలల తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి ఈఎస్ఐ కార్పొరేషన్ బదిలీ చేసింది. క్యాజువాలిటీ ఆపరేషన్ థియేటర్, అగ్నిమాపక తలుపులు, ఐసీయూలు, యోగా గదితోసహా అన్ని గదులనూ ఔరా అనిపించే విధంగా నిర్మిం చారు. మహిళా శిశు వైద్య విభాగానికి ఏకంగా ఒక ఫ్లోర్‌నే కేటాయించారు. అన్ని రకాల వైద్య సదుపాయాలకు ఏర్పాట్లు కల్పించారు. సెకండరీ కేర్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనిక్, ఆర్థో, ట్రామా కేర్‌తోసహా 26 రకాల వైద్య సేవ లను అందించే విధంగా నిర్మాణాలు ఉన్నాయి. సెంట్రల్ ఏసీ సదుపాయంతోపాటు భద్రతకు 50 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రతి వార్డులోని ప్రతి మంచం వద్ద ఆక్సిజన్, వెంటిలే టర్ సౌకర్యం ఉంది. కాకపోతే మంచాలే ఇప్పటి వరకూ ఏర్పాటు చేయలేదు. ఆపరేషన్ థియేట ర్లు అత్యంత విశాలంగా ఉండి యంత్రాల కోసం ఎదురు చూస్తున్నాయి. ఈ ఆస్పత్రి పరిధిలో రాజమండ్రి, సీతంపేట, లాలాచెరువు, ఇన్నీసుపే ట, కడియం, ధవళేశ్వరం, కొవ్వూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం,తణుకు, భీమవరం, వేంద్ర డిస్పెన్సరీలు ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోరులో 32 గదు ల్లో ఓపీ, వ్యాధి నిర్ధారణ, ఈసీజీ, ఎక్స్‌రే, క్యాజు వాలిటీ, క్యాజువాలిటీ ఆపరేషన్ థియేటర్, ఫార్మ సీ, క్యాంటీన్, లాండ్రి, ఆయుర్వేద, హెూమియో, ఎమర్జెన్సీ వార్డు, ఫిజియోథెరపీ తదితర సేవలు ఉంటాయి. రెండో ఫ్లోరును పూర్తిగా మాతా శిశు వుల కోసం కేటాయించారు. వారికి సంబంధిం చిన అన్ని వైద్య సదుపాయాలనూ ఏర్పాటు చేస్తున్నారు.

ఐసీయూ, పీఐసీయూ, హెచ్‌డీ యూ, ఎన్ఐసీయూ, ఎస్ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు, ప్రొసీజర్ రూమ్స్, లాకర్లు ఇలా 26 రూములు నిర్మించారు. మూడో ఫ్లోరులో 12 పడకల చొప్పున 6 వార్డులుండగా.. పురుషులకు, మహిళలకు విడివిడిగా విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు. వార్డుల్లో సైతం ఆక్సిజన్, వెంటి లేటర్, వంటి సదుపాయాన్ని కల్పించారు. ఇదే ఫ్లోరులో లైబ్రరీ, బ్లడ్ స్టోరేజీ, ఎంఆర్‌డీ, పరిపాలన గదులు ఉన్నాయి. ఆస్పత్రి భవనంలో ప్రస్తుతం ఒక్క ఫ్లోరు మాత్రమే వినియోగంలోకి వచ్చింది. రెండో ఫ్లోరులో సూపరింటెండెంట్ గదిని మాత్రమే వాడుతుండగా మిగతా ఫ్లోర్లు, గదులు.. రోగులు, సిబ్బంది, వైద్య పరికరాల కోసం ఎదురు చూస్తున్నాయి. వైద్యులు, సిబ్బం దికి నివాసాలను కూడా ఆస్పత్రి ప్రాంగణంలోనే నిర్మించారు. నిర్వహణ గాడిలో పడకపోతే కోట్లు వృథా అయినట్టేనని భావించాల్సి వస్తుంది.

ఈ ఆస్పత్రిలో డాక్టర్లు, నర్సింగ్, పరిపాలన కలిపి 30 మంది ఉన్నారు. కానీ 100 మందికిపైగా ఉండాలి. స్వచ్ఛ భారత్‌ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టా త్మకంగా అమలు చేస్తుండగా.. ఈ ఆస్పత్రిని హౌస్ కీపింగ్ స్టాఫ్ సరిపడా లేకుండానే పరిశుభ్రతను నెట్టు కొస్తున్నారు. కొత్త భవనంలోకి ఆస్పత్రి కార్యకలాపాలు మారిన తర్వాత 12 మంది పారిశుధ్య సిబ్బందిని, ఆరుగురు సెక్యూరిటీని మాత్రమే ఇచ్చారు. మూడుకుపైగా ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు, అత్యవసర వైద్య విభా గాలు ఉండడంతో షిఫ్టుల వారీగా పనిచేయాల్సి వస్తుంది. అందువల్ల 100 మంది వరకూ డాక్టర్లు ఉండాలి. హౌస్ కీపింగ్ సిబ్బంది 200 మంది వరకూ అవసరం అవుతుంది. కానీ సూపర్ స్పెషాలిటీ సేవలు లేకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

## భీభత్సం సృష్టించిన చేపల లారీ.. ముగ్గురు మృతి



**నెల్లూరు, పతాకం న్యూస్:** జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నగరంలోని ఎన్టీఆర్ నగర్ వద్ద జాతీయ రహదారిపై చేపల లోడ్‌తో వెళ్తున్న కంటైనర్ లారీ బీభత్సం సృష్టించింది. వేగంగా దూసుకొచ్చిన లారీ స్థానికులపై దూసుకెళ్లింది. అలాగే టాటా ఏస్ వాహనం, మూడు బైకులు ఢీ కొట్టిన లారీ ఆపై చెట్టును ఢీకొట్టి నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా... ప్రమాదం జరిగిన ప్రాంతంలో వాహనాలు చాలా నెమ్మదిగా నడపాల్సి ఉంటుంది. అక్కడ కొన్ని ఇండికేషన్స్ కూడా ఉంటాయి. అయితే ఇవేమీ పాటించుకోకుండా చెన్నై నుంచి కలకత్తా వైపు వెళ్తున్న ఓ లారీ అతి వేగంగా దూసుకొచ్చింది. రోడ్డు పక్కన చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వారి పైకి వెళ్లింది. ఎప్పుడూ చాలా రద్దీగా ఉండే ప్రాంతంలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో ముగ్గురు చనిపోవడంతో పాటు పలువురు గాయపడటం పలువురిని తీవ్రంగా కలిచివేసింది. ప్రస్తుతం క్షతగాత్రులకు ఆస్పత్రుల్లో చికిత్స జరుగుతోంది. వారిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘోర రోడ్డు ప్రమాదం జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది.

## డేటా ప్రొటెక్షన్ చట్ట నిబంధనలపై ప్రెస్‌క్లబ్ ఆందోళన




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** డేటా ప్రొటెక్షన్ చట్టం 2023లోని కొన్ని నిబంధనలు పత్రికా స్వేచ్ఛను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పిసిఐ) ఆందోళన వ్యక్తం చేసింది. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డిపిడిపి) చట్టం 2023లో కొన్ని నిబంధనలు అస్పష్టతతోనూ, అపరిమిత పరిధి కలిగి ఉన్నాయి. దీంతో ఈ చట్టాన్ని పత్రికా స్వేచ్ఛను దెబ్బతీసేందుకు ఆయుధంగా ఉపయోగించడానికి అవకాశం పెరిగిందని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పిసిఐ) పేర్కొంది. డిపిడిపి చట్టంలోని నిబంధనల్ని ఇటీవల నోటిఫై చేసిన విధానంపై పిసిఐ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ చట్టంపై కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరపడానికి జూన్ 2025లో ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖకి 22 ఇతర ప్రెస్ బాడీలతో కలిసి జాయింట్ మెమోరాండం సమర్పించినట్లు పిసిఐ తెలిపింది. ఈ డిపిడిపి చట్టం పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తుంది. భావ ప్రకటనా హక్కు ఆర్టికల్ 19(1)ను నేరుగా దెబ్బతీస్తుంది. అందుకే రెండు ప్రధాన అంశాలపై పిసిఐ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖకు మెమోరాండం సమర్పించింది. మొదటిది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో జర్నలిస్టులు, మీడియా సంస్థల పనితీరును అణచివేయకుండా ఒక నమూనా అమలు నియమాలను రూపొందించడంలో సహాయపడడానికి ప్రభుత్వంతో అత్యంత నిర్మాణాత్మకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చలు జరపాలి. రెండవది డిపిడిపి చట్టం 2023లోని కొన్ని సెక్షన్లు వాటి విస్తృత నిర్వచనాలు గానీ, వాటి పరిధికి సంబంధించిన అంశాలు చాలా అస్పష్టంగా ఉన్నాయి. ఈ నిబంధనలు పత్రికా స్వేచ్ఛను తగ్గిస్తాయి. మీడియా గొంతు నొక్కేడానికి ఈ చట్టం ఆయుధంగా మార్చుకోవడానికి ఈ నిబంధనలు అవకాశాలు కల్పిస్తాయి అని పిసిఐ నొక్కి చెప్పింది. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖకి ఇచ్చిన మెమోరాండంలో కూడా ఈ రెండు అంశాలనే పిసిఐ తెలిపింది. అయితే మేము ఏ దశలోనూ చట్టాన్ని రద్దు చేయాలని అడగలేదు. డిజిటల్ యుగంలో పౌరుల వ్యక్తిగత డేటాను రక్షించడానికి ఒక చట్టం యొక్క ఆవశ్యకత గురించి మాకు బాగా తెలుసు. కొన్ని సెక్షన్లపై మరింత స్పష్టత కోరుతూ.. వాస్తవ ప్రపంచ దృశ్యాలను మరింత వివరించాలని పత్రికా సంస్థలు ఆగస్టు 22, 2025న 35 ప్రశ్నల సమితిని మంత్రిత్వశాఖకు సమర్పించాయని పిసిఐ పేర్కొంది.

# అవయవదానంతో మరణించినా జీవించవచ్చు!

'చిరునవ్వులతో బతకాలి, చిరంజీవిగా బతకాలి' అంటుంటారు పెద్దలు. అయితే కేవలం బతికి ఉన్నప్పుడు మాత్రమే కాదు మరణానంతరం కూడా జీవించవచ్చు. మనం భౌతికంగా భూమి మీద ఉండకపోవచ్చు. కానీ, మన కళ్లు ఈ లోకాన్ని చూస్తునే ఉంటాయి. మనం ఏ లోకంలో ఉన్నా కిడ్నీలు రక్తాన్ని శుద్ధిచేస్తూనే ఉంటాయి. మన శ్వాస ఆగిపోయినా గుండె కొట్టుకుంటూనే ఉంటుంది. అయితే ఇవన్నీ జరగాలంటే అవయవదానం చేయాలంటున్నారు నిపుణులు. ఆర్గాన్? డొనేషన్? వల్ల మనం మరణించినా బతికి ఉండే అవకాశం లభిస్తోందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో అవయవ దానం అంటే ఏమిటి? ఏఏ అవయవాలు దానం చేయవచ్చు? ఎలా రిజిస్ట్రేషన్ చేసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం!




**అవయవదానం అంటే :** కన్ను తెరిస్తే జననం, కన్ను మూస్తే మరణం. ఈ రెండింటి మధ్య ఊగిసలాట మనిషి జీవితం. కానీ, మరణించినా మరికొందరిలో జీవించి ఉండటమే అవయవదానం. దీని వల్ల కొన్ని కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపడానికి వీలవుతుంది. సాధారణంగా రక్తదానంతో పాటు కిడ్నీ, కాలేయం, గర్భాశయం, గర్భాధారణ కణజాలం (నవజాత శిశువు పుట్టిన తర్వాత మిగిలిపోయిన కణజాలం) మాత్రమే దానం చేయవచ్చని %ఎశ్రీవఉవశ్రీఖఅసఎశ్రీఱఅఱఎ% అధ్యయనం పేర్కొంది. రక్తదానం ఎవరికైనా చేయవచ్చు కానీ, కిడ్నీ, కాలేయ దానాలపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. కుటుంబ సభ్యులు, రక్త సంబంధీకుల నుంచి మినహా ఇతరుల నుంచి వీటిని సేకరించకూడదు. కానీ, ఏదైనా ప్రమాదంలో జీవన్మృతులు లేదా బ్రెయిన్?డెడ్ అయిన వ్యక్తుల నుంచి మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, గుండె, గుండె కవాటాలు, పేగులు, క్లోమం, కార్నియా సేకరించి అవసరమైన వారికి అమరుస్తారు. ఇలా ఒక వ్యక్తి సేకరించిన అవయవాలతో ఏడు నుంచి తొమ్మిది మందికి పునర్జన్మను ప్రసాదించే అవకాశం ఉంటుంది. గుండె ఆగి చనిపోయిన వ్యక్తుల నుంచి కళ్లు, చర్మం, గుండె కవాటాలు, ఎముక వంటి కణజాలాలను 6 నుంచి 24 గంటల్లోపు సేకరించవచ్చు.

తీవ్రమైన ప్రమాదం లేదా ఏదైనా వ్యాధి కారణంగా కోమాలోకి వెళ్లి, మళ్లీ స్పృహలోకి రాలేని పరిస్థితిలో ఉన్న బాధితుడిని డాక్టర్లు బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారిస్తారు. అయితే, ఆసుపత్రిలో వెంటిలేటర్ సహాయంతో వారి గుండె ఇంకా కొట్టుకుంటూ, ఇతర ముఖ్య అవయవాలు మాత్రం కొన్ని గంటల పాటు పనిచేస్తూనే ఉంటాయి. వీటిని కుటుంబ సభ్యుల అనుమతితో సాధ్యమైనంత త్వరగా సేకరించి బ్లడ్‌గ్రూప్ తదితర అంశాలు సరిపోలిన వారికి నిర్దేశిత సమయంలో అమర్చుతారు. బాధితుడిని బ్రెయిన్‌డెడ్‌గా ధ్రువీకరించడానికి ఒకరి కంటే ఎక్కువ మంది వైద్య నిపుణులతో కూడిన బోర్డు తప్పనిసరిగా ఉండాలి.

బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించిన వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలను నిర్దేశిత సమయాల్లో అవసరమైన వారికి అమర్చాలి. ఆలస్యమైతే అవి పాడైపోయే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో గుండె, ఊపిరితిత్తులను 4 నుంచి 6 గంటల లోపు, ప్రేగు, క్లోమం 6 గంటల లోపు, కాలేయం 6 నుంచి 12 గంటల లోపు, కిడ్నీలను 30 గంటల లోపు అమర్చాలని అధ్యయనం పేర్కొంది. భారతదేశంలో వివిధ కారణాల వల్ల కీలకమైన అవయవాలు పనిచేయక చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడున్న వారు చాలామందే ఉన్నారు. ప్రస్తుతం అవయవ దానంపై అవగాహన పెరగడం వల్ల వాటిని దానం చేయడానికి చాలా మంది ముందుకు వస్తున్నారు. కానీ, అవయవ దానాన్ని ఎలా చేయాలో తెలియక చాలా మంది ఆగిపోతున్నారు. ఇలాంటి వారు నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ లేదా రాష్ట్ర స్థాయిలో ఉన్న జీవన్‌దాన్ లేదా స్వచ్ఛంద సంస్థలలో ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకోవాలి. తల్లిదండ్రుల వివరాలు, బ్లడ్ గ్రూపు, మెయిల్ ఐడీ వంటి వివరాలను నమోదు చేయాలి. ఈ క్రమంలో మన అన్ని అవయవాలు లేదా నిర్దిష్ట అవయవాలు లేదా కణజాలాలను దానం చేయడానికి ఎంచుకోవచ్చు. ఆ తర్వాత అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించడానికి వీలుగా మన కుటుంబ సభ్యులలో ఒకరి పేరు, మొబైల్ నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలి. ఇలా ఫారమ్?ను సరిచూసుకుని, అవయవ దానం చేయడానికి మన స్వచ్ఛందంగా అంగీకరిస్తున్నట్లు ధ్రువీకరించాలి. నమోదు చేయడం పూర్తయిన తర్వాత ప్రత్యేకమైన నంబర్?తో గుర్తింపు కార్డు వస్తుంది. ఈ కార్డు కేవలం మన కోరికను తెలియజేసే పత్రం మాత్రమే.

భారతదేశ చట్టం ప్రకారం, మరణానంతరం కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా అవయవ దానం జరగదు. ఇలా నమోదు చేసుకున్నప్పటికీ, బ్రెయిన్? డెడ్ అయిన తర్వాత దాత కుటుంబ సభ్యులు లేదా దగ్గరి బంధువులు రాతపూర్వక అనుమతి ఇస్తేనే అవయవాలను సేకరిస్తారు. కాబట్టి, అవయవ దానం చేయాలనుంటే కుటుంబ సభ్యులకు తప్పనిసరిగా తెలియజేయాలి. ఈ నేపథ్యంలో ఇలా అవయవదానం రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ఒకవేళ దాత సాధారణ మరణం లేదా బ్రెయిన్ డెడ్ అయిన సందర్భాల్లో కుటుంబ సభ్యులు సంబంధిత ఆసుపత్రి లేదా సంస్థకు సమాచారం ఇవ్వాలి. ఆ తర్వాత వైద్య బృందం దాత అవయవాలు మార్పిడికి అనుకూలంగా ఉన్నాయో లేదా తనిఖీ చేసి సేకరిస్తారు. 18 సంవత్సరాలు నిండిన ఎవరైనా స్వచ్ఛందంగా అవయవదానం చేయవచ్చు. ఇందుకు గరిష్ఠ వయసు పరిమితి అంటూ ఏమీ లేదు. ఆరోగ్యకరమైన అవయవాలు ఉంటే 90 ఏళ్ల వయస్సు వారు కూడా దానం చేయొచ్చు. భారతదేశంలో మానవ అవయవాలు, కణజాల మార్పిడి చట్టం-1994 చట్టం తెచ్చారు. ఈ చట్టాన్ని అవసరాలకు అనుగుణంగా 2011లో సవరించారు. అవయవాల సేకరణ, కేటాయింపు, తరలింపు వంటి వాటిని జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ పర్యవేక్షిస్తుంది. రాష్ట్ర స్థాయిలో సంస్థలు అవయవ దాన కార్యకలాపాలను సమన్వయం చేస్తాయి. తెలుగు రాష్ట్రాల్లో అవయవదానానికి జీవన్?దాన్, మరి కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఎంతగానో కృషిచేస్తున్నాయి. ఈ క్రమంలో అవయవాల మార్పిడి శస్త్రచికిత్సలు చేయాలంటే ముందస్తుగా ఆయా ఆస్పత్రులు, వైద్యులు తమ పేర్లను జీవన్?దాన్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ కానీ ఆసుపత్రుల్లో అవయవ మార్పిడి చేయడం చట్టారీత్యా నేరంగా పరిగణిస్తారు.

# నూనె లేదా బాడీ లోషన్ చలికాలంలో చర్మానికి ఏది మేలు?



చలికాలంలో శరీరం డీ హైడ్రేట్ గా మారుతుంది. దాహం లేదంటూ తక్కువగా నీరు తాగడమే కాదు వాతావరణంలో మార్పుల వలన చాలా మంది స్కిన్ బిగుతుగా మారుతుంది. కొందరు దద్దుర్లు, దురదలతో ఇబ్బంది పడుతూ ఉంటారు. పొడి చర్మాన్ని హైడ్రేట్ గా మార్చుకోవడానికి కొంత మంది బాడీ లోషన్ లేదా బాడీ ఆయిల్ ఉపయోగిస్తారు. అయితే ఈ రెండిటిలో ఏది బెస్ట్ తెలుసుకుందాం..

శీతాకాలం చాలా మందికి ఇష్టమైనది. అదే సమయంలో చాలా మందికి రకరకాల సమస్యలు వస్తాయి. ఈ సమయంలో చాలా మంది చర్మం బిరుసుగా, పగినట్లు గా, పొడిగా మారుతుంది. చర్మం తేమను కోల్పోతుంది. చలికాలంలో చాలా మంది శరీరాలు పగిలిపోయేంతగా మారతాయి. చాలా మందికి దద్దుర్లు, దురదలు వస్తాయి. చలికాలపు పొడి చర్మం నుంచి ఉపశమనం కోసం బాడీ లోషన్ లేదా బాడీ ఆయిల్ ఉపయోగించాలా అనే విషయం తెలుసుకుందాం..

బాడీలోషన్ అయినా, బాడీ ఆయిల్ అయినా.. చలికాలంలో వీటిని ఉపయోగించడం చాలా ముఖ్యం. ఎందుకో తెలుసా? శీతాకాలపు పొడి గాలిలో మన చర్మం తేమను కోల్పోతుంది. ఈ సమస్యను నివారించడానికి బాడీ లోషన్ లేదా బాడీ ఆయిల్ ఉపయోగించడం అవసరం. కొంత మంది శరీరం జిడ్డుగా ఉంటుంది. ఇలాంటి వారు నూనె రాసుకుంటే మరింత జిడ్డుగా మారుతుంది. కనుక బాడీ లోషన్ వాడొచ్చు.




చర్మ రకాన్ని బట్టి బాడీ లోషన్ లేదా బాడీ ఆయిల్ ఎంపిక చేసుకోవాలి. చర్మం చాలా పొడిగా ఉంటే షియా బటర్, ఆర్గాన్ ఆయిల్ లేదా కోకో బటర్‌తో కూడిన బాడీ లోషన్‌ను ఉపయోగించండి. అదే సమయంలో జిడ్డుగల చర్మం కలిగి ఉంటే తేలికపాటి, ఆస్ట్రింజెంట్ బాడీ లోషన్‌ను ఉపయోగించవచ్చు.

కొందరికి బాడీ లోషన్ కంటే ఆయిల్ బెస్ట్ ఎంపిక ఎందుకంటే బాడీ ఆయిల్ చర్మాన్ని చాలా కాలం పాటు రక్షిస్తుంది.

బాడీ లోషన్ చాలా త్వరగా చర్మంలోకి శోషించబడుతుంది. బాడీ లోషన్ కంటే బాడీ ఆయిల్ చర్మాన్ని మృదువుగా చేస్తుంది. బాడీ ఆయిల్ మసాజ్ చేయడం వల్ల చర్మానికి రక్త ప్రసరణ పెరుగుతుంది. చర్మ కణాలకు పోషణ లభిస్తుంది. బాడీ ఆయిల్ చర్మాన్ని కాంతివంతం చేస్తుంది. స్నానం చేసిన తర్వాత చర్మం తడిగా ఉన్నప్పుడే బాడీ ఆయిల్ అప్లై చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

రాత్రి పడుకునే ముందు బాడీ ఆయిల్ రాసుకోవచ్చు. ఇలా చేయడం వలన రాత్రి సమయంలో చర్మాన్ని బాగా తేమగా ఉంటుంది.

# ఏఐ ఆర్భాటం..ఉద్యోగాల చెలగాటం



**అమరావతి, పతాకం న్యూస్:** ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఎ.ఐ) అనే కృత్రిమ మేధ చుట్టూ పరిభ్రమిస్తున్న ప్రపంచ ఆర్థిక సాంకేతిక చర్చ ఇప్పుడు భారత దేశాన్నీ తెలుగు రాష్ట్రాలనూ తాకింది. విశాఖలో గూగుల్ అదానీ ఎ.ఐ డేటా సెంటర్ స్థాపనకు ఒప్పందంతో ఈ చర్చ మరింత వేడిపుంజుకుంది. 1500 కోట్ల డాలర్ల పెట్టుబడితో రెండు లక్షల ఉద్యోగాలు వస్తాయనే ప్రచారంపైనా చాలా వాదోపవాదాలు నడిచాయి. ఈ డేటా సెంటర్ల భూసేకరణ, పర్యావరణపై ప్రభావంపైన కూడా భిన్నాభిప్రాయాలు ఇంకా సాగుతున్నాయి కూడా. ఈ క్రమంలో విశాఖ డేటా సెంటర్ క్రెడిట్ వార్ పరాకాష్టకు చేరి మేమంటే మేమని వైసిపి, టిడిపి లు ప్రచారం హోరెత్తించాయి. ఆ రాజకీయాలు అలా వుంచితే ఈ సమయంలో ప్రపంచవ్యాపితంగా ఇదే విధంగా ఎ.ఐ పై చర్చలు సాగుతున్నాయి. ఉత్పత్తి సాధనాలు సాంకేతిక పరిజ్ఞానం ఆధునీకరణలో ఎప్పుడూ ముందుకు పోవలసిందే. కానీ అదే సమయంలో ఉద్యోగాలపై, ఉత్పత్తిపై దాని ప్రభావం ఏమిటి అనేది కూడా తప్పక అవగాహన పెంచుకోవలసిన విషయం. ఇతరులెవరో కాకుండా నేరుగా గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల సిఇవోలు, ప్రఖ్యాత ఆర్థికవేత్తలు ఈ విషయంలో ఏం చెప్పారో తెలుసుకోవడం కన్నా ఇందుకు మెరుగైన మార్గం వుండదు. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ సిఇవో సుందర్ పిచారు మొన్న బుధవారం మాట్లాడుతూ ప్రస్తుతం ఎ.ఐ కి సంబంధించి సాగుతున్న హడావుడిలో హేతుబద్ధత కొంత లోపిస్తున్నదని వ్యాఖ్యానించారు. ప్రపంచ వ్యాపితంగా పెద్ద కంపెనీలు ఎ.ఐ వ్యవస్థలకు మారడం ద్వారా ఖర్చులు తగ్గించుకునేందుకు, లాభాలు పండించుకోవడానికి భారీ బడ్జెట్లు కేటాయించడం జరుగుతున్నది. గూగుల్ జెమినీ, చాట్‌బాట్, ఎ.ఐ చిప్స్ తీసుకొచ్చింది. ఓపెన్ ఎ.ఐ మైక్రోసాఫ్ట్ మధ్య పోటీ కూడా సాగుతున్నది. గత ఏడు నెలల్లో ఆల్ఫాబెట్ షేర్ల విలువ మూడున్నర లక్షల కోట్ల డాలర్లు పెరగడానికి ఎ.ఐ వెల్లువ కారణమైంది. ఎ.ఐ బుడగకు కారణమైన సంక్లిష్ట ఆర్థిక ఇంజనీరింగ్ దీని వెనక వుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎ.ఐ బుడగ పగిలిపోతే గూగుల్ తట్టుకోగలదా అని సుందర్ పిచారుని ప్రశ్నించినపుడు మాతో సహా ఏ కంపెనీ కూడా ఈ ముప్పు తప్పించుకోజాలదని సమాధానమిచ్చారు. గతంలో వచ్చిన ఇంటర్నెట్ వ్యవహారాన్ని ఇందుకు ఉదాహరణగా చూపారాయన. ఇంటర్నెట్ వచ్చినపుడు కూడా ఇలాగే అతిగా పెట్టుబడులు పెట్టారు. అయితే అది ఇంటర్నెట్ నిజంగా అంత బలమైందా అని మాలాంటివాళ్లం ఎప్పుడూ ప్రశ్నించలేకపోయాము. అప్పుడు జరిగినట్టే ఇప్పుడూ జరుగుతుంది. ఇందులో కొంత హేతుబద్ధత వుంది. ఇలాంటి సమయాల్లో హేతురాహిత్యం కూడా కొంత వుంటుందని సుందర్ పిచారు తేల్చిచెప్పేశారు. పిచారుతో పాటు ఓపెన్ ఎ.ఐ సిఇవో శాం ఆల్మన్ కూడా ఎ.ఐ సాంకేతిక వ్యవస్థలో కొన్ని అంశాలు నిజంగా గాలిబుడగ స్వభావంతో వున్నాయని వ్యాఖ్యానించారు. దాని గురించి చెప్పడం చాలా ఆసక్తిగానూ వుంటుందన్నారు. అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్ మాట్లాడుతూ దీనివల్ల ఎ.ఐ ప్రభావంతో పారిశ్రామిక బుడగ కూడా వస్తుందని చెబుతూ ఈ రెండింటికీ మధ్య తేడాను వివరించే ప్రయత్నం చేశారు. "బ్యాంకింగ్ బుడగ, బ్యాంకింగ్ వ్యవస్థలో సంక్షోభం 2008లో అది ఎంతో దుష్ప్రభావం చూపింది. సమాజం అలాంటి వాటిని రాకుండా చేయాలని కోరుకుంది. పరిశ్రమలకు సంబంధించిన బుడగల సంగతీ అంతే. అయితే మంచి బుడగలూ వుంటాయి. అంతా అయిపోయాక చూస్తే వాటివల్ల కలిగిన ఫలితాలేమిటో ఎవరు విజేతలో వాటి వల్ల ఎవరు ప్రయోజనం పొందారో అర్థమవుతుంది" అంటూ నర్మగర్భంగా మాట్లాడారు. మైక్రోసాఫ్ట్ సిఇవో సత్య నాదెళ్ల కూడా ఈ సమయంలో ఇండియా లోనే పర్యటిస్తున్నారు. ఎ.ఐ శకంలో తమ వాణిజ్య నమూనా పూర్తిగా మరోసారి ఆలోచించుకోవలసి వుంటుందని ఆయనన్నారు. పదిహేనేళ్ల కిందట క్లౌడ్ కంప్యూటింగ్‌కు మారినప్పుడు తమకు పనిచేసి పెట్టిన నిపుణుడు రోల్ఫ్ హార్మ్స్‌నే మళ్లీ ఈ దశలోనూ పరివర్తనకు తోడ్పడాలని తెచ్చుకున్నారు. 2025 జులైలో తమ ఉద్యోగులకు దీనిపై లేఖ రాసిన సత్య నాదెళ్ల అనిశ్చిత పరిస్థితి, గజిబిజి లో లే ఆఫ్‌లకు దిగాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పరిశ్రమలో కావలసింది విజయమేనంటూ వినియోగదారుల కొత్త అవసరాలను అందుకోవడం కోసం ఇప్పుడున్న వాణిజ్య నమూనా మార్పుతో కొత్త తరహా ఉద్యోగాలు సృష్టించాల్సి వస్తుందన్నారు. దీర్ఘకాలంలో మైక్రోసాఫ్ట్ మనుగడ కోసం ఎంతో ఆందోళన సత్య నాదెళ్ల లేఖలో ప్రతిబింబించిందని మీడియా వ్యాఖ్యానించింది. మినీ కంప్యూటర్లను ఒకప్పుడు పాలించిన డిజిటల్ ఎక్విప్‌మెంట్ కార్పొరేషన్ కొన్ని వ్యూహాత్మక తప్పిదాలు చేసిన కారణంగా మటుమాయమైపోయిన ఉదాహరణ తనను వెంటాడుతున్నదని పేర్కొన్నారు. మనం సృష్టించిన కొన్ని అతి పెద్ద వ్యాపార వ్యవస్థలు మనం ముందుకు పోతున్నకొద్దీ కొరగానివిగా మారిపోవచ్చని హెచ్చరించారు. మైక్రోసాఫ్ట్ అనేది వినియోగదారీ పరికరాలను సరఫరా చేసే పరిస్థితి నుంచి ఎ.ఐ ఏజంట్లకు అంటే యంత్రాలకు మౌలిక సదుపాయాల కల్పనలో సహకరించే పాత్రలోకి మారిపోవచ్చని సూచించారు. వాస్తవానికి సత్య నాదెళ్ల స్వయంగా తన గత పాత్ర నుంచి మారిపోగా మరొకరిని తీసుకొచ్చారు. సుందర్ పిచారు మాట్లాడుతూ ఎ.ఐ అనేది సిఇవో లను కూడా వదలిపెట్టబోదని చెప్పిన దాని ప్రభావం ఇక్కడ మనకు కనిపిస్తుంది. సత్య నాదెళ్ల మాటలు అతి తీవ్ర హెచ్చరిక అని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్వయంగా నిర్వహించిన ఐ.టి కంపెనీల అధినేతల సమావేశంలోనే ఎ.ఐ పై పెట్టుబడులు పెంచాలని నిర్ణయానికి వచ్చిన విషయం గతంలో చెప్పుకున్నాం. మీరు ఇప్పుడు ఏ పత్రిక చూసినా డేటా సెంటర్‌పై లేదా ఎ.ఐ పై ఇంత పెట్టుబడి పెట్టాలని నిర్ణయించినట్టు ప్రకటనలే కనిపిస్తున్నాయి. ఉదాహరణకు టి.సి.ఎస్ తో కలసి డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికి టిపిజి ఒప్పందం చేసుకోగా అందుకు 200 కోట్ల డాలర్లు పెట్టుబడి పెడతామన్నారు. 1.2 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటరర్ నిర్మాణానికి దాదాపు 700 కోట్ల డాలర్లు పెట్టుబడి పెడతామని టి.సి.ఎస్ ప్రకటించింది.

# 12 గంటల ప్రయాణం 2 గంటలకు.. తిరుపతి మీదుగా దూసుకెళ్లనున్న బుల్లెట్ రైలు



**తిరుపతి, పతాకం న్యూస్:** చెన్నై-హైదరాబాద్ మధ్య ప్రతిపాదించిన బుల్లెట్ రైలు ప్రాజెక్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ రైలును తిరుపతి మీదుగా నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే ప్రణాళికలు ఖరారు చేసి, సవరించిన నివేదికను తమిళనాడు ప్రభుత్వానికి అందజేసింది. ఈ నివేదికకు సూత్రప్రాయ ఆమోదం లభిస్తే, త్వరలోనే భూసేకరణ పనులు ప్రారంభం కానున్నాయి.

తొలుత చెన్నై నుంచి గూడూరు మీదుగా హైదరాబాద్‌కు ఈ బుల్లెట్ రైలు మార్గాన్ని ప్రతిపాదించారు. అయితే, ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి మీదుగా ప్రాజెక్టును అమలు చేయాలని తమిళనాడు ప్రభుత్వం రైల్వేకు విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలోనే అధికారులు మార్గంలో మార్పులు చేసి, తుది నివేదికను సమర్పించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం, ఈ ప్రాజెక్టు కోసం ఒక్క తమిళనాడులోనే 223.44 హెక్టార్ల భూమి అవసరమని అక్కడి ప్రభుత్వ కన్సల్టెన్సీ సంస్థ 'రైట్స్' నివేదిక ఇచ్చింది. చెన్నై సెంట్రల్, మీంజూరు వద్ద మరో స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

ఈ ప్రాజెక్టు పూర్తయితే 778 కిలోమీటర్ల దూరంలోని చెన్నై-హైదరాబాద్ మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. ప్రస్తుతం 12 గంటలుగా ఉన్న ప్రయాణం కేవలం 2 గంటల 20 నిమిషాలకు పరిమితం అవుతుందని అధికారులు చెబుతున్నారు. దేశంలో బుల్లెట్ రైలు ప్రాజెక్టుల పనులు వేగవంతంగా సాగుతున్నాయి. 2027 నాటికి సూరత్‌లో తొలి బుల్లెట్ రైలును నడపాలని లక్ష్యంగా పెట్టుకోగా, దక్షిణాదిలో చెన్నై-బెంగళూరు-మైసూరు మార్గంలోనూ భూసర్వే జరుగుతోంది.




# రికార్డు సృష్టించిన రవీంద్ర జడేజా

:



గువాహటి వేదికగా టీమిండియా-సౌతాఫ్రికా మధ్య రెండో టెస్టు కొనసాగుతోంది. ఇప్పటికే రెండో ఇన్నింగ్స్ ఆడిన సఫారీ సేన ఐదు వికెట్ల నష్టానికి 260 పరుగులు చేసి డిక్లేర్ ఇచ్చింది. ఇందులో భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా నాలుగు వికెట్లు తీశాడు. ఈ క్రమంలో జడ్డూ రికార్డు సృష్టించాడు. టెస్టు క్రికెట్‌లో దక్షిణాఫ్రికాపై 50 వికెట్లు సాధించిన ఐదో భారత బౌలర్‌గా నిలిచాడు. ఈ జాబితాలో జడేజా కంటే ముందు అనిల్ కుంబ్లే, జవగల్ శ్రీనాథ్, హర్భజన్ సింగ్, రవిచంద్రన్ అశ్విన్ ఉన్నారు. ప్రస్తుతం గువాహటిలో జరుగుతున్న టెస్ట్.. జడేజాకు సౌతాఫ్రికాతో 11వ మ్యాచ్. అతడు ఇప్పటి వరకు 19 ఇన్నింగ్స్‌ల్లో 50 వికెట్లు తీసుకున్నాడు. అయితే దక్షిణాఫ్రికాపై ఎక్కువ వికెట్లు తీసుకున్న భారత బౌలర్‌గా రికార్డు మాత్రం అనిల్ కుంబ్లే పేరు మీద ఉంది. అతడు 21 టెస్టు మ్యాచుల్లో 84 వికెట్లు తన సొంతం చేసుకున్నాడు.

## నాలుగో రోజు ముగిసిన ఆట..

# ఓటమి అంచున టీమిండియా



గౌహతి వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా ముందు కఠిన సవాల్ నిలిచింది. మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన సఫారీ జట్టు, నాలుగో రోజు తమ రెండో ఇన్నింగ్స్‌ను 5 వికెట్ల నష్టానికి 260 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. దీంతో, భారత్ ముందు 549 పరుగుల అసాధ్యమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన 288 పరుగుల భారీ ఆధిక్యానికి ఈ స్కోరు తోడవడంతో టీమిండియా ముందు ఈ కొండంత టార్గెట్ నిలిచింది.

రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా బ్యాటర్ ట్రిస్టన్ స్టబ్స్ (94) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. కేవలం 6 పరుగుల తేడాతో సెంచరీ చేజార్చుకున్నప్పటికీ, కీలక సమయంలో జట్టుకు భారీ స్కోరు అందించడంలో సఫలమయ్యాడు. అతనికి తోడుగా టోనీ డి జోర్జి (49), చివర్లో వియాన్ ముల్డర్ (35 నాటౌట్) రాణించారు. భారత బౌలర్లలో ఒక్క రవీంద్ర జడేజా మాత్రమే 4 వికెట్లతో ప్రభావం చూపగలిగాడు. వాషింగ్టన్ సుందర్‌కు ఒక వికెట్ దక్కింది. మిగతా బౌలర్లు వికెట్లు తీయడంలో విఫలమయ్యారు.

అంతకుముందు, దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో చేసిన 489 పరుగులకు సమాధానంగా, భారత జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 201 పరుగులకే కుప్పకూలింది. యశస్వి జైస్వాల్ (58), వాషింగ్టన్ సుందర్ (48) మినహా మిగతా బ్యాటర్ల నుంచి సరైన సహకారం అందలేదు. దీంతో భారత్ 288 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ లోటుతో వెనుకబడింది. సఫారీ బౌలర్లలో మార్కో యన్సెన్ నిప్పులు చెరిగే బంతులతో 6 వికెట్లు పడగొట్టి భారత బ్యాటింగ్ ఆర్డర్‌ను ఛిన్నాభిన్నం చేయగా, స్పిన్నర్ సైమన్ హార్మర్ 3 వికెట్లతో అతనికి చక్కటి సహకారం అందించాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా, తొలి ఇన్నింగ్స్‌లోనే తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. సెనురన్ ముత్తుసామి (109) సెంచరీతో కదం తొక్కగా, మార్కో జాన్సెన్ (93) మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టు స్కోరును 489 పరుగులకు చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు. ప్రస్తుతం నాలుగో రోజు ఆట కొనసాగుతుండగా, టీమిండియా ముందు దాదాపు ఒకటిన్నర రోజుల ఆట మిగిలి ఉంది. ఈ అసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించడం లేదా మ్యాచ్‌ను డ్రా చేసుకోవడం భారత బ్యాటర్లకు చాలెంజ్ అనే చెప్పాలి.

లక్ష్య ఛేదనకు దిగిన భారత్.. తడబడుతోంది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్లు నష్టపోయి 27 పరుగులు చేసింది. సాయి సుదర్శన్(2), నైట్ వాచ్‌మెన్‌గా వచ్చిన కుల్దీప్ యాదవ్(4) క్రీజులో ఉన్నారు. ఆదిలోనే ఓపెనర్లు యశస్వి జైస్వాల్(13), కేఎల్ రాహుల్(6) పెవిలియన్ బాట పట్టారు. ఇంకా ఒక్క రోజు ఆట మిగిలి ఉంది. భారత్ 522 పరుగుల వెనుకంజలో ఉంది. ఆ ఆధిక్యాన్ని.. మన బ్యాటర్ల తీరును చూస్తే ఈ సిరీస్ కూడా వైట్‌వాష్ అయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఒకవేళ 1-1తో సమం చేయాలంటే టీమిండియా ఈ మ్యాచ్‌లో కచ్చితంగా గెలవాలి. కానీ అది ఏదో అద్భుతం జరిగితే గానీ కష్టం. చివరి రోజు భారత బ్యాటర్లు గట్టిగా పోరాడి మూడు సెషన్లపాటు బ్యాటింగ్ చేయగలిగితే మ్యాచ్‌ను కనీసం డ్రాగానైనా ముగించొచ్చు. మరి సఫారీ బౌలర్లను మనోళ్లు ఏమాత్రం ఎదుర్కొంటారో చూడాలి.




# శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ‘ద్రౌపది 2’



నటుడు రిచర్డ్ రిషి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘ద్రౌపది 2’. ఈ సినిమా నుంచి మేకర్స్ ఓ కీలక అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న రక్షణ ఇందుచూడన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆమె ద్రౌపది దేవి పాత్రను పోషిస్తోంది. ఈ చిత్రాన్ని నేతాజి ప్రొడక్షన్స్, జీఎం ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్లపై సోల చక్రవర్తి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మోహన్. జి దర్శకత్వం వహిస్తున్నారు. విడుదలైన పోస్టర్‌లో రక్షణ ఇందుచూడన్ ఎంతో హుందాగా, గాంభీర్యంగా కనిపిస్తోంది. ఆమె ఆహార్యం, అలంకరణ పాత్రకు తగ్గట్టుగా ఉన్నాయి. పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపిస్తున్న భారీ సెట్, సినిమాను ఏ స్థాయిలో నిర్మిస్తున్నారో తెలియజేస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోందని, త్వరలోనే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి విడుదల తేదీని ప్రకటిస్తామని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతం అందిస్తుండగా, ఫిలిప్ ఆర్ సుందర్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. యాక్షన్ సంతోష్ పోరాట సన్నివేశాలను కంపోజ్ చేస్తున్నారు. దేవరాజ్.ఎస్ ఎడిటర్‌గా, ఎస్ కే ఆర్ట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# రూ.100 కోట్ల వసూళ్ల దిశగా దూసుకెళ్తున్న గుజరాత్ చిత్రం ‘లాలో’



భారీ తారాగణం లేదు, పాన్-ఇండియా స్థాయిలో ప్రచారం అంతకన్నా లేదు. కేవలం రూ.50 లక్షల బడ్జెట్‌తో తెరకెక్కిన ఓ గుజరాతీ సినిమా ఇప్పుడు రూ.100 కోట్ల వసూళ్ల దిశగా దూసుకెళ్తూ చరిత్ర సృష్టించబోతోంది. ఆ చిత్రమే ‘లాలో – కృష్ణ సదా సహాయతే’. కథలో ఉన్న బలమే పెట్టుబడిగా బాక్సాఫీస్ వద్ద

ఏడు వారాల క్రితం ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ చిత్రానికి ఆరంభంలో ఆదరణ కరువైంది. తొలివారం కేవలం రూ.26 లక్షలు మాత్రమే వసూలు చేసింది. అయితే, కథ బాగుండటంతో నెమ్మదిగా మౌత్ టాక్ పుంజుకుంది. ఇదే సినిమాకు అతిపెద్ద ప్రచారంగా మారింది. నాలుగో వారం నుంచి వసూళ్లలో అనూహ్యమైన పెరుగుదల కనిపించింది. ఆరో వారం ముగిసేసరికి రూ.70 కోట్లకు పైగా వసూలు చేసిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఏడో వారంలోనూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది.

ఈ విజయంతో ‘లాలో’ గుజరాతీ సినీ చరిత్రలోనే సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఇప్పటివరకు రూ.50 కోట్లతో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఉన్న ‘చాల్ జీవి లాయియే’ (2019) రికార్డును ఇది బద్దలు కొట్టింది. ఇప్పుడు తొలి రూ.100 కోట్ల సినిమాగా నిలిచేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్ర విజయంతో దేశవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 28న హిందీ డబ్బింగ్‌తో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. అంకిత్ సఖియా దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రీవా రచ్, శ్రుహద్ గోస్వామి ప్రధాన పాత్రలు పోషించారు. గతం తాలూకు బాధలతో సతమతమయ్యే లాలో అనే రిక్షా డ్రైవర్, అనుకోకుండా ఓ ఫామ్‌హౌస్‌లో చిక్కుకుపోతాడు. అక్కడ అతనికి కలిగే ఆధ్యాత్మిక అనుభవాలు, శ్రీకృష్ణుడి లీలలు తన జీవితాన్ని ఎలా మార్చాయన్నదే ఈ చిత్ర కథాంశం.

# నెల తిరగకుండానే ఓటీటీలోకి రవితేజ ‘మాస్ జాతర’



మాస్ మహారాజా రవి తేజ నటించిన తాజా చిత్రం ‘మాస్ జాతర’ ఓటీటీలోకి వచ్చేస్తోంది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంది. నవంబర్ 28 నుంచి ఈ చిత్రం స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారికంగా ప్రకటించింది. థియేటర్లలో విడుదలైన నెల రోజులు కూడా గడవక ముందే ఈ సినిమా డిజిటల్ వేదికపైకి రావడం గమనార్హం.

రవితేజ కెరీర్‌లో 75వ చిత్రంగా ఎన్నో అంచనాల మధ్య ‘మాస్ జాతర’ అక్టోబర్ 31న థియేటర్లలో విడుదలైంది. అయితే, రొటీన్ కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా నిరాశపరిచింది. భారీ అంచనాలను అందుకోలేక ఫ్లాప్‌గా నిలిచింది. భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటించగా, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించింది.

ఇటీవల ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్‌పై సోషల్ మీడియాలో పలు ఊహాగానాలు వచ్చాయి. దీంతో సినీ ప్రియుల్లో కొంత గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో నెట్‌ఫ్లిక్స్ అధికారిక ప్రకటనతో స్పష్టత ఇచ్చింది. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ భాషల్లోనూ ఈ సినిమా అందుబాటులో ఉంటుందని నెట్‌ఫ్లిక్స్ తన ప్రకటనలో తెలిపింది. దీంతో థియేటర్లలో చూడలేకపోయిన ప్రేక్షకులు ఓటీటీలో చూసేందుకు సిద్ధమవుతున్నారు.






Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**